ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆస్పత్రిలో అభిషేక్.. నమీబియాతో మ్యాచ్ డౌటే! 8

గురువారం 12.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 323 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

సంగారెడ్డిలో ఉద్రిక్తత

సీఐపై దాడికి యత్నించిన జగ్గారెడ్డి

- బోగస్ ఓట్లు వేయిస్తున్నారని సీఐ శివకుమార్‌కు కాంగ్రెస్ అభ్యర్థి ఫిర్యాదు
- అభ్యర్థిని సీఐ గల్లా పట్టి నెట్టివేశారని ఆరోపణ
- సీఐ రెచ్చగొట్టడమే ఘటనకు కారణం
- శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి డిమాండ్

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి

ఫిబ్రవరి 11: సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని 34వ వార్డులో మున్సిపల్ పోలింగ్ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బోగస్ ఓట్లు వేయిస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి అక్కడ విధుల్లో ఉన్న సీఐ శివకుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే,

...:: మిగతా 2లో

దొంగ ఓట్లను అడ్డుకున్నం.. తప్పా?

- ఎన్నికల కమిషన్‌ను నిలదీసిన జగ్గారెడ్డి
- దొంగ ఓట్ల తొలగింపులో ఈసీ విఫలం
- ఈసీ జవాబు చెప్పాలన్న కాంగ్రెస్

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 11: సంగారెడ్డిలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఉద్రిక్తతపై ఎన్నికల కమిషన్ స్పందించిన నేపథ్యంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పలు ప్రశ్నలు లేవనెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో భారీ స్థాయిలో దొంగ ఓట్లు నమోదు

...:: మిగతా 2లో

కామారెడ్డి జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్స్ జెండర్లు

ప్రశాంతంగా పురపోరు

73.01% పోలింగ్ నమోదు

13న కౌంటింగ్

16న చైర్మన్ల ఎన్నిక

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ముగిసిన పోలింగ్
- మధ్యాహ్నం ఊపందుకున్న పోలింగ్
- పలుచోట్ల ఘర్షణలు, ఆందోళనలు
- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత
- 29వ వార్డులో సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ
- సంగారెడ్డిలో ఉద్రిక్తత.. సీఐపై జగ్గారెడ్డి ఫైర్
- ఓటర్ల మనోభావాలు దెబ్బతీసేలా జగ్గారెడ్డి వ్యాఖ్యలు
- కేసు నమోదు చేసి, నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: పుర, నగరపాలక ఎన్నికల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,981 వార్డుల్లో చెదురు మదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. నాయకులు, యువత, వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పురపాలక ఎన్నికల్లో 73.01 శాతం పోలింగ్ నమోదైనట్లుగా అధికారులు వెల్లడించారు.. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు నిర్వహించిన ఎన్నికలు చెదురుమదురు ఘటనల మధ్య ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులను ఎస్ఈసీ ఏర్పాటు చేసింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు

...:: మిగతా 2లో

ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ హవా

మూడు కార్పొరేషన్లుగా గ్రేటర్ హైదరాబాద్

- ఇక నుంచి జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ
- కొత్తగా సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లు
- జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఆర్వీ కర్ణన్ కొనసాగింపు
- సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజగిరికి వినయ్‌కృష్ణారెడ్డి
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రతిపక్షం సిటీ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ తో పాటు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. అలాగే ఈ మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను కూడా నియమించింది. జీహెచ్ ఎంసీ కమిషనర్ గా ఆర్ వీ కర్ణన్ ను యథాతథంగా కొనసాగించిన ప్రభుత్వం సైబరాబాద్ కు శ్రీజన, మల్కాజిగిరికి వినయ్ కృష్ణారెడ్డిని కమిషనర్లుగా నియమించింది. జీహెచ్ ఎంసీ లోని 150 డివిజన్లు

...:: మిగతా 2లో

పది మంది ఐఏఎస్‌ల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్
- పంచాయతీరాజ్ కమిషనర్‌గా దివ్యకు అదనపు బాధ్యతలు
- పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా రఘురామ్
- జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారిగా జయేశ్ రంజన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్అధికారులకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం వెలువడిన ఉత్తర్వులలో ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న జ్యోతి బుద్ధ ప్రకాశ్ ను సింగరేణి సీఎండీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు అదనపు బాధ్యతల్లో ఉన్న కృష్ణభాస్కర్ ను ప్రభుత్వం తప్పించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి సబ్యసాచి ఘోష్ ప్రస్తుత బాధ్యతలతో పాటు

...:: మిగతా 2లో

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలు

- ఓటమి భయంతోనే ఎన్నికల్లో అధికార దుర్వినియోగం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం
- బీఆర్ఎస్ కార్యకర్తలకు అభినందనలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అధికార పక్షం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రలోభాలకు గురిచేసినా మొక్కవోని దీక్షతో పోరాడిన బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు పురపాలక సమరంలో పార్టీ శ్రేణులు కనబరిచిన పోరాట స్ఫూర్తి పార్టీకి బలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని కేటీఆర్ పేర్కొన్నారు. గత రెండేళ్ల పాలనలో వైఫల్యాలు ఎదుర్కొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటమి భయంతోనే ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో ఎదురైన ఫలితాల నేపథ్యంలో పట్టణాల్లోనూ అదే పరిస్థితి తలెత్తుతుందనే ఆందోళనతో ప్రభుత్వం చర్యలకు దిగిందని ఆయన ఆరోపించారు. అక్రమంగా లూటీ చేసిన ప్రజాధనంతో ప్రజాతీర్పును ప్రభావితం చేయాలని చూస్తున్న కుట్రలను తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. పోలీసు వ్యవస్థను ఉపయోగించి బీఆర్ఎస్ శ్రేణులపై వేధింపులు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన కేటీఆర్, ప్రజల హామీలను విస్మరించిన ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. ఎన్ని నిర్బంధాలు, కేసులు ఎదురైనా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

మున్సిపాలిటీలన్నీ హస్తం కైవసం

- మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వాసం
- బీజేపీ, బీఆర్ఎస్ ఘర్షణ వాతావరణం సృష్టించాయి
- పట్టణ సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ విఫలమైందని వ్యాఖ్య

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 80 శాతం కంటే పైగా స్థానాలు గెలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

...:: 3లో

మహదేవప్ప కుటుంబానికి అండగా బీజేపీ

- మృతడి భార్యకు 10 లక్షల చెక్కును అందజేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- నిందితులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్

...:: 3లో

భారతమాతను మోదీ సర్కార్ అమ్మేసింది

- అమెరికాకు మోదీ సర్కార్‌హోల్‌సేల్‌గా సరెండర్ అయ్యింది
- అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగం
- కేంద్రం తీరుపై కాంగ్రెస్ అగ్రనేత ఘాటు వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారత్, అమెరికా మధ్యంతర ట్రేడ్ డీల్ ద్వారా భారత మాతను కేంద్ర ప్రభుత్వం అమ్మేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికా చేతుల్లో పెట్టి, రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి సర్కారు హోల్‌సేల్‌గా సరెండర్ అయిపోయిందని ఆయన ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఏకపక్షంగా ఉందని, దీనివల్ల భారత రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. ఈ ట్రేడ్ డీల్

...:: మిగతా 2లో

భారత్ - పాకిస్తాన్ యుద్ధం నేనే ఆపా!

గతేడాది జరిగిన భారత్, పాక్ సైనిక ఘర్షణ అణు యుద్ధంగా మారి ఉండేదని, దాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. నిజంగానే భారత్, పాక్ సైనిక ఘర్షణ న్యూక్లియర్ వార్‌కు దారితీసేదన్నారు.

7

ఎప్‌స్టీన్‌ను కలిసింది నిజమే!

ఎప్‌స్టీన్ ఫైల్స్ అంశంలో తన పేరు రావడం, వాటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. రాహుల్ గాంధీవి నిరాధారమైన ఆరోపణలు అని తోసిపుచ్చారు.

7

రాహుల్ సభా హక్కుల ఉల్లంఘన

భారతదేశ అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతున్నదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని లోక్‌సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.

7

అధికారంలో కాంగ్రెస్‌కు చోటివ్వం

అధికారంలో వాటా కావాలంటూ కాంగ్రెస్ చేస్తున్న డిమాండును తమిళనాడు సీఎం స్టాలిన్ తోసిపుచ్చారు. తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం పనిచేయదని ఆయన అభిప్రాయపడ్డారు.

7

రాజకీయం

సంగారెడ్డిలో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

ఫిర్యాదును పట్టించుకోకుండా సీఐ దురుసుగా ప్రవర్తించి అభ్యర్థిని గల్లా పట్టి నెట్టివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి హుటాహుటీన మోటార్ బైక్‌పై పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. స్థానికులు వివరాలు తెలియజేయడంతో ఆగ్రహానికి గురైన జగ్గారెడ్డి సీఐ శివకుమార్‌ను తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడికి యత్నించగా, అక్కడే ఉన్న డీఎస్పీ, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. దొంగ ఓట్లతో గెలవాలనే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన జగ్గారెడ్డి, పోలింగ్ రద్దు చేయకపోతే అక్కడి నుంచి కదిలేది లేదని హెచ్చరించారు. కొందరు పోలీసుల ప్రవర్తన వల్లే సంగారెడ్డిలో శాంతి భద్రతలకు భంగం కలుగుతోందని విమర్శించారు. సీఐ రెచ్చగొట్టడమే తాను 26 సంవత్సరాల తర్వాత పోలింగ్ కేంద్రానికి రావడానికి కారణమని తెలిపారు. సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలు మోహరించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రఘునందన్ సంఘటనా స్థలానికి చేరుకుని జగ్గారెడ్డితో చర్చించారు. సీఐపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఉద్రిక్తత చల్లారింది. ఈ ఘటనతో కొంతసేపు పోలింగ్ కేంద్రం వద్ద ఆందోళనకర వాతావరణం నెలకొన్నప్పటికీ, తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

దొంగ ఓట్లను అడ్డుకున్నం.. తప్పా?

మొదటిపేజీ తరువాయి

అయ్యాయని, ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లను తీసుకువచ్చి సంగారెడ్డిలో ఓటర్లుగా చేర్చారని ఆరోపించారు. ప్రతి వార్డులో 300కు పైగా బోగస్ ఓట్లు నమోదు చేశారని, అప్పట్లో నమోదు చేసిన ఆ దొంగ ఓట్లనే ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో వినియోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దొంగ ఓట్లు వేయకుండా కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారని, అలా అడ్డుకున్న కార్యకర్త గల్లాను సీఐ శివకుమార్ పట్టుకోవడంతో వివాదం చెలరేగిందన్నారు. ఈ సమాచారం తెలుసుకుని తాను అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. దొంగ ఓట్లను ముందుగానే తొలగించడంలో ఎన్నికల కమిషన్ ఎందుకు విఫలమైందని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఈ గొడవకు ఎన్నికల కమిషన్, జిల్లా అధికారులు కూడా బాధ్యులే కాదా అని నిలదీశారు. బోగస్ ఓటర్లను అడ్డుకున్న తమపై కేసులు పెట్టాలని సూచించడం సమంజసమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే దొంగ ఓట్లపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మూడు కార్పొరేషన్లుగా గ్రేటర్ హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

డి లిమిటేషన్ లో భాగంగా 243 డివిజన్లుగా ఏర్పడ్డాయి. వీటితో పాటు విలీనమైన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు 57 డివిజన్లుగా ఏర్పాటయ్యాయి. పరిపాలన సౌలభ్యం, అధికార వికేంద్రీకరణ లక్ష్యంగా జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా ప్రభుత్వం విస్తరించింది. 300 డివిజన్లతో జీహెచ్ ఎంసీ బృహత్ నగరపాలక సంస్థగా ఏర్పడింది. 60 సర్కిళ్లు, 12 జోన్లతో పరిపాలన వ్యవస్థ ఉండనుంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ యంత్రాంగం రాజపత్రం సిద్ధం చేయగా, ఇవాళ ఏ క్షణమైనా గెజిట్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఫిబ్రవరి 10న జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు కూడా పూర్తైంది. దీంతో ప్రభుత్వం మూడు కార్పొరేషన్ల ఏర్పాటుపై ప్రక్రియను వేగవంతం చేసింది.

కార్పొరేషన్ల వారీగా అసెంబ్లీ నియోజకవర్గాలు

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) : కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి పూర్తిగా వస్తాయి. కూకట్‌పల్లి, మేడ్చల్, పటాన్‌చెరు, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు పాక్షికంగా వస్తున్నాయి.

జీహెచ్ఎంసీ పరిధిలో :

అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, మలక్‌పేట్, సనత్‌నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా, సికింద్రాబాద్ పూర్తి పరిధికి వస్తుండగా, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా ఉంటున్నాయి.

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లో :

మల్కాజిగిరి, సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఉప్పల్, ఎల్బీనగర్ శాసనసభ నియోజకవర్గాలు పూర్తిగా, మేడ్చల్, కూకట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా కొంతవరకు వస్తున్నాయి. మొత్తంగా టీసీయూఆర్ పరిధిలో 20 శాసనసభ నియోజకవర్గాలు పూర్తిగా, ఆరు అసెంబ్లీల్లో కొంతభాగం వరకు ఉంటాయి.

పది మంది ఐఏఎస్‌ల బదిలీ

మొదటిపేజీ తరువాయి

ఎస్సీ అభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్‌గా, కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. గిరిజన సంక్షేమ శాఖ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించింది. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా కాత్యాయినీ దేవిని బదిలీ చేస్తూ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే సందీప్ కుమార్ సుల్తానియాకు ప్లానింగ్ విభాగంతో పాటు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీజీఆర్ఏసీ) డైరెక్టర్ జనరల్ గా అదనపు బాధ్యతలు అప్పగించింది. దివ్య దేవరాన్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ గా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే మయాంక్ మిట్టల్ ను జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గా ప్రభుత్వం నియమించింది. పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా రఘురామ శర్మను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జీహెచ్ ఎంసీ అదనపు కమిషనర్ ఎస్ పంకజ ను మల్కాజిగిరి హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్బీ ఈడీ గా వెయిటింగ్ లో ఉన్న స్రామాట్ అశోక్ ను నియమించింది. సైబరాబాద్ హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్బీ ఈడీ గా రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ గా ఉన్న ఎం. సంతోష్‌ను నియమించింది. ఉపాధి శిక్షణ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ గా ఉన్న కె. శశికిరణ్ చారిని లోక్ భవన్ సంయుక్త కార్యదర్శిగా నియమించింది. పరిపాలనా సౌలభ్యం కోసం పలువురు నాన్ క్యాడర్ అధికారులను బదిలీ చేస్తూ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని తెలిపింది.

జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారిగా జయేశ్ రంజన్ :

ఫిబ్రవరి 10వ తేదితో జీహెచ్ఎంసీ పాలక వర్గం గడువు ముగిసింది. దీంతో ప్రత్యేక అధికారిగా జయేశ్ రంజన్ నియమితులయ్యారు. ఈరోజు ఆ బాధ్యతలను స్వీకరించారు. జీహెచ్ఎంసీతో పాటు మల్కాజిగిరి, సైబరాబాద్, కార్పొరేషన్ల బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ పాలకవర్గం ఐదేళ్ల గడువు ముగియడంతో ప్రత్యేక అధికారిని నియమించారు. గ్రేటర్ చరిత్రలో 17 ఏళ్ల తర్వాత ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగనుంది. కొత్తగా ఏర్పడిన రెండు కార్పొరేషన్లలో 35 లక్షల చొప్పున, పాత కార్పొరేషన్ లో 70 లక్షల జనాభా ఉండేలా అధికార యంత్రాంగం విభజన ప్రక్రియ చేశారు. మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా జి.సృజన బాధ్యతలు స్వీకరించారు.

గవర్నర్ బడ్జెట్ ప్రసంగమంతా అవాస్తవాలు, కల్పితాలే. కూటమి సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయి. మెగా డీఎస్సీని దగా చేశారు. గోడపై క్యాలెండర్లు మారుతున్నా జాబ్ క్యాలెండర్ మాత్రం రావడం లేదు. అన్నదాత సుఖీభవ కింద 40 లక్షల మంది రైతులకు టోకరా పెట్టారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు అంతా ఫేక్.

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా

- 'పీపుల్స్ పల్స్' ఎగ్జిట్ పోల్ సర్వే

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 11: తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధిస్తుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఈ పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని చెప్పింది. తెలంగాణలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు కోలాహలంగా జరిగాయి. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిపోగా.. బూత్ లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అయితే, ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది.

మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్..

మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్, కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలున్నాయని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో

బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని సర్వేలో వెల్లడైంది.

మున్సిపాలిటీల్లో..

మొత్తంగా 68-76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 29-36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 35 బీజేపీ, 01 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ తన సర్వే ఫలితాల్లో పేర్కొంది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది.

బీఆర్ఎస్ ఖేల్ ఖతం.?

బీజేపీ జోరు..ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకోనుందని సర్వే చెప్పింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించి, వాటిని కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీసేలా ఉన్నాయని తెలిపింది. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి లేదని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లలో అధికార పీఠాన్ని నిర్ణయించడంలో ఎంఐఎం కీలక పాత్ర (కింగ్ మేకర్) పోషించనుందని సర్వే వెల్లడించింది. మొత్తంగా చూస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత పటిష్టం చేసుకోగా, బీఆర్ఎస్, బీజేపీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయనే విధంగా సర్వే ఫలితాలు వెలువరించింది.

ప్రశాంతంగా పురపోరు

మొదటిపేజీ తరువాయి

ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు 2,582 వార్డుల్లో కౌన్సిలర్ల ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే తొమ్మిది పురపాలికల్లోని 12 వార్డుల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ మున్సిపాల్టీలోని ఆరో వార్డులో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడటంతో అక్కడ ఎన్నిక నిర్వహించలేదు. అన్ని మున్సిపాల్టీల్లో కలిపి 10,719 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పుర ఎన్నికలకు సంబంధించి 6,017 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

అధికారులు ముందస్తు చర్యలు

రాష్ట్రంలోని 8,191 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ పూర్తి కావడంతో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే గురువారం నిర్వహించనున్నట్లుగా తెలిసింది. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 136 కేంద్రాల్లో ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఈనెల 16వ తేదీన మున్సిపాల్టీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

పలుచోట్ల స్వల్ప ఘర్షణలు

పురపాలక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చెదురుమదురు ఘటనల మినహా పురపాలిక పోలింగ్ సజావుగా సాగింది. సంగారెడ్డిలో 34 వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి చొక్కాను సీఐ పట్టుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామని బూత్‌లోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులుజగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కి సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. జగ్గారెడ్డిపై కేసు నమోదు చేసి, నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశాలిచ్చింది. ఓటర్ల మనోభావాలు దెబ్బతీసేలా జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారంటూ ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలోనే పరస్పర దాడులకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. రామాయంపేట ఏడో వార్డులో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 29వ వార్డులో సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగాఇంది. ఇరు వర్గాల ఘర్షణలో సీపీఎం కార్యకర్తకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కుమారుడు సిద్ధార్థ పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి దిగారు. దీంతో పోలీసులు లాఠీఛార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అలాగే నల్గొండ కార్పొరేషన్‌లోని పదో వార్డులో పోలీసులకు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తల నినాదాలు చేశారు. మునుగోడు క్రాస్ రోడ్డు వద్ద బీజేపీ కార్యకర్తల రాస్తారోకో నిర్వహించారు. దొంగ ఓట్లు వేసేందుకు యత్నించిన వారిని అరెస్టు చేయాలని, పోలీసులు తమను దూషించారాని బీజేపీ నేతల ఆరోపించారు. సూర్యాపేటలో 13వ వార్డులో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు అధికార పార్టీకి సహకరిస్తున్నారని టీఆర్పీ ఆరోపించింది. జనగామ రోడ్డుపై బైఠాయించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ నేత బుచ్చి రాములుపై కర్రలతో దాడి చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. శేరిగూడ పోలింగ్ కేంద్రం ముందు ఓ ఇంట్లో యువకులు గుమిగూడారు. గుంపును చెదరగొట్టేందుకు వచ్చిన పోలీసులతో యువకుల వాగ్వాదానికి దిగారు. వాగ్వాదానికి దిగిన యువకులను పీఎస్‌కు తరలిస్తుండగా పోలీసు వాహనానికి కుటుంబసభ్యులు అడ్డుపడ్డారు. ఇంట్లో ఉన్నవారిని పీఎస్‌కు తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారతమాతను మోదీ సర్కార్ అమ్మేసింది

మొదటిపేజీ తరువాయి

అమల్లోకి వస్తే, భారత మార్కెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రవాహం భారీగా పెరుగుతుందని రాహుల్ తెలిపారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ధాటికి భారత రైతులు విలవిలలాడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఇక భారతదేశ వస్త్ర పరిశ్రమ పని అయిపోయినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాతో ట్రేడ్ డీల్ ఫలితంగా ఇంధన భద్రతను భారత్ కోల్పోయిందన్నారు. ఇకపై భారత్ ఎవరి నుంచి చమురును కొనాలో అమెరికాయే చెబుతుందని రాహుల్ పేర్కొన్నారు. ట్రేడ్ డీల్‌పై చర్చల సందర్భంగా, భారత్‌ను సరిసమాన భాగస్వామిగా పరిగణించాలని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్‌ను కేంద్ర ప్రభుత్వం కోరి ఉండాల్సిందన్నారు. "మీ ప్రభుత్వం భారతదేశాన్ని అమ్మేసింది. దేశాన్ని అమ్ముతున్నందుకు సిగ్గుగా లేదా ? మీరు భారత మాతను అమ్మేశారు'' అని రాహుల్ కామెంట్ చేశారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావం మోదీపై పడి ఉండొచ్చు

"అంత సాధారణంగా భారత్‌ను ప్రధాని మోదీ అమ్మేస్తారంటే నేను నమ్మను. బహుశా, ఆయనపై ఏదో బయటి ఒత్తిడి ప్రభావం పడి ఉండొచ్చు. ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజ్ అయ్యాయని తెలిసినప్పటి నుంచి ప్రధాని మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. వాటితో ముడిపడిన ఒత్తిడి ప్రభావం ప్రధానిపై పడిందేమో. వాళ్లు ప్రధాని మోదీని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండొచ్చు. బెదిరించి ఉండొచ్చు. ఇంకో 30 లక్షలకుపైగా ఎప్‌స్టీన్ ఫైల్స్ తదుపరి విడతల్లో రిలీజ్ కావాల్సి ఉంది. గతంలో భారత వస్తు,ఉత్పత్తులపై అమెరికా 3 శాతం సుంకాన్నే విధించేది. కానీ ఇక నుంచి ఆరు రెట్లు అదనంగా 18 శాతం సుంకాన్ని విధిస్తుందట. ఇక ఇదే సమయంలో అమెరికా సరుకులపై భారత్ విధించే 16 శాతం సుంకాన్ని, సున్నాకు తగ్గిస్తారట. ఎందుకోసం ప్రధాని మోదీ ఇలాంటివన్నీ ఒప్పుకున్నారు ? ప్రస్తుతం అమెరికా నుంచి భారత్ ఏటా 46 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఏకంగా 100 బిలియన్ డాలర్లు దాటిస్తామని ట్రంప్‌కు మోదీ ఎందుకు హామీ ఇచ్చారు ?'' అని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. "ప్రపంచంలో ఇక యుద్ధాల శకం ముగిసిందని గతంలో ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను గత సంవత్సరమే మనం చూశాం. రష్యా ఉక్రెయిన్ యుద్ధం గత మూడేళ్లుగా జరుగుతోంది. ఇజ్రాయెల్ గాజా సైనిక ఘర్షణను యావత్ ప్రపంచం చూసింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా కుట్రలను ఇప్పుడు చూస్తున్నాం. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలుచుకొని ప్రపంచ దేశాలపై అమెరికా ఒత్తిడిని పెంచుతోంది. అమెరికా ఆధిపత్యాన్ని, దాని డాలరు పెత్తనాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. అంటే మనం ఏకధ్రువ ప్రపంచం నుంచి బహుళ ధ్రువ ప్రపంచం దిశగా పయనిస్తున్నాం'' అని రాహుల్ గాంధీ తెలిపారు.

అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేయాలి

"భారత ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదికలో రెండు ముఖ్యమైన పాయింట్లను ప్రస్తావించారు. అవి నాకు నచ్చాయి. ప్రపంచ దేశాల నడుమ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, అమెరికా ఆధిపత్యాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు సవాల్ చేస్తున్నాయి అనేది తొలి పాయింట్. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి దేశాలపై దాడి చేసే పరిస్థితులు ప్రపంచంలో ఏర్పడుతున్నాయి అనేది రెండో పాయింట్. అందుకే అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని మనం సవాల్ చేయాలి. సింగిల్ సూపర్ పవర్ కాన్సెప్ట్‌ను ఒప్పుకోకూడదు. కానీ ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి భారత్ పైకి ప్రయోగించే అవకాశాన్ని అమెరికాకు మోదీ సర్కారు ఇచ్చింది. భారత్ ఎవరి నుంచి ముడి చమురును కొనాలి అనేది, మరో దేశం (అమెరికా) వాళ్లు నిర్ణయించాలా ? భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సిగ్గుగా లేదా ? '' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 11 : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ స్క్రాప్ గోదాంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. భారీ స్థాయిలో మంటలు, పొగలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సేఫ్టీ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పడానికి ప్రయత్నించి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ఖాళీ ప్రదేశంలో గోదాం కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న జిల్లా అగ్నిమపక అధికారి మాట్లాడుతూ నివాస గృహాల మధ్య ఇలాంటి గోదాంలు ఏర్పాటు చేయడం నేరమని అన్నారు. ఈ గోదాంలో ప్లాస్టిక్ సామాగ్రి ఉండడం తో ఒక్కసారిగా మంటలు వ్యాపించి దట్టమైన పొగలు అలుముకున్నాయని తెలిపారు. మూడు ఫైర్ ఇంజన్ ల సహాయం తో సిబ్బంది తో మంటలు అదుపు చేసామన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఒకవేళ ఇలాంటి ఘటన అర్ధరాత్రి జరిగితే పక్కన వున్నవాళ్లు నిద్రావస్థలో ఉంటే ప్రాణ నష్టం జరిగివుండేదని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వర్ రావు తెలిపారు.

కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఓటు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 11: తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన నియోజకవర్గం కొడంగల్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుని, శంషాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరారు.

ఖమ్మం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం జిల్లా మధిరలోని 9వ వార్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసిన అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయన్నారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిదెందుకు క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని వెల్లడించారు. చెరువులను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు, చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వంలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్న భట్టి గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆన్లైన్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

హుస్నాబాద్‌లో కుటుంబసభ్యులతో మంత్రి పొన్నం ..

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ఒక ఆయుధమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని పొన్నం అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీలోని 3వ వార్డులోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో కుటుంబ సమేతంగా మంత్రి ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్‌లో రెండుచోట్ల బీఆర్ఎస్ అభ్యర్థుల భర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి మంజుల భర్త శ్రీనివాస్, ఒకటో వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి స్వప్న భర్త విజయ్ భాస్కర్ ఉన్నారు. ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ వద్ద రూ.6 వేలు, విజయ్‌భాస్కర్ వద్ద రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఓటు వేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రంలో ఫోటో దిగారు.

ఎవరెవరు, ఎక్కడెక్కడ ఓటు వేశారంటే?

నల్గొండ పబ్లిక్ స్కూల్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటు వేశారు. నిజామాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ 50వ డివిజన్ జ్యోతినగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట 9వ వార్డులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటు వేశారు. జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.నందికొండ మున్సిపాలిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల 5 వార్డులో మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు వేశారు. నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఉన్నారు. జానారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలో నిర్మలా పాఠశాల నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత నోముల భగత్ ఓటు వేశారు.

రాష్టంలో మున్సిపాలిటీలన్నీ హస్తం కైవసం

- **మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వాసం**

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, ఫిబ్రవరి 11: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 80 శాతం కంటే పైగా స్థానాలు గెలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఎన్నికల్లో ఘర్షణ వాతావరణం సృష్టించాయని, పోలింగ్ బూత్‌లలో జోక్యం చేసుకుని ఓటర్లను భయపెట్టే ప్రయత్నం చేశాయని ఆరోపించారు. పోలీసులపై దాడులు, ఓటర్లను ప్రలోభపెట్టే ఘటనలు చోటుచేసుకున్నాయని అన్నారు. రెండు సంవత్సరాల్లోనే ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పట్టణ సమస్యలను పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే లు, నాయకులు పలువురు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన డీసీపీ

ప్రతిపక్షం,మొయినాబాద్, ఫిబ్రవరి 11 : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ బుధవారం హిమాయత్ నగర్ లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ యోగేష్ గౌతమ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రత తో పాటు ఎన్నికలు జరుగుతున్న తీరుపై డీసీపీ యోగేష్ గౌతమ్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై డీసీపీ యోగేష్‌గౌతమ్ అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు.

హుస్నాబాద్‌లో రికార్డు స్థాయి పోలింగ్

- **84.21 శాతం ఓటింగ్ నమోదు**

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 11: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్లు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు. పట్టణ వ్యాప్తంగా నిర్వహించిన పోలింగ్‌లో మొత్తం 84.21 శాతం ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ కేంద్రాలు సందడిగా మారాయి. ఉదయం 9 గంటలకు 16.57 శాతంగా ఉన్న ఓటింగ్, మధ్యాహ్నం 1 గంట సమయానికి 58.05 శాతానికి చేరుకుంది. సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ గడువు ముగిసే సమయానికి మొత్తం 19,227 మంది ఓటర్లలో 16,192 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన 40 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. స్త్రీ, పురుష ఓటర్లు దాదాపు సమాన స్థాయిలో పోటీ పడి ఓటు వేశారు. పురుష ఓటర్లలో 84.68 శాతం మంది, మహిళా ఓటర్లలో 83.78 శాతం మంది ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్, సహాయ జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. గతం కంటే భారీ స్థాయిలో పోలింగ్ శాతం పెరగడంతో రాజకీయ పార్టీల్లో గెలుపోటములపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది.

ప్రజాస్వామిక వ్యవస్థ లో ఓటు ఆయుధం: పొన్నం

హుస్నాబాద్ నవ భారత్ హైస్కూల్ లో కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ లో ఓటు అనేది ఆయుధం అని అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం ఓటర్లు ఓటు వేస్తున్నారని, అర్బన్ ప్రాంతాల్లో అవగాహన తక్కువ ఉందని అన్నారు.

చిట్యాలలో ప్రశాంతంగా పోలింగ్

- **87.88 శాతం పోలింగ్ నమోదు**

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 11: నల్గొండ జిల్లాలోని చిట్యాలలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు నిరాటంకంగా కొనసాగింది. ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొన్నారు. 87.88 శాతం పోలింగ్ నమోదయింది. 12 వార్డుల్లో 12,118 మంది ఓటర్లు ఉండగా 10,649 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 5188 మంది, మహిళలు 5460 మంది ఓటు వేశారు. ఒంటి గంట సమయానికి ఓటింగ్ శాతం పుంజుకుంది. వృద్ధులు నడవలేని వారు సైతం ఓటింగ్ లో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్లను అధికారులు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసులను నియమించారు. శివనేనిగూడెంలో బీఆర్ఎస్ వారికి పోలీసులకు మధ్య వాగ్వాదం జరగగా... అన్నిచోట్ల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన వెంటనే, అధికారులు ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేశారు. ఈ బాక్సులను చిట్యాల నుండి నల్గొండలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న ఉదయం 8 గంటల నుండి ప్రారంభం కానుంది. అదేరోజు మధ్యాహ్నం వరకు ఫలితాలు వెలువడనున్నాయి.

అగ్నికి అహుతైన ప్రైవేట్ స్కూల్ భవనం

- **పోలింగ్ సందర్భంగా సెలవు కావడంతో తప్పిన పెను ప్రమాదం**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 11 : సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి లోని శ్రద్ధ ప్రయివేట్ పాఠశాలలో మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. జీ ప్లస్ త్రీ అంతస్తుల భవనంలో ని గ్రౌండ్ ఫ్లోర్ లో మంటలు చెలరేగాయి. క్షణాల్లో మిగతా మూడు ఫ్లోర్ లకు వ్యాపించాయి. ఒక్కసారిగా దట్టమైనా పొగలతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగినాయి. ఆ మంటల్లో భవనం మొత్తం అగ్నికి అహుతయ్యింది. ఈ ఘటనతో చుట్టుపక్కన ఉన్న స్థానికులు పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ల తో ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో స్కూల్ కు సెలవు కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటన భవనంలో షాక్ సర్క్యూట్ కారణమైన ఉండవచ్చని భావిస్తున్నారు.

భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

- **70 కిలోల ఎండు గంజాయి స్వాధీనం**

హైదరాబాద్, ఫిబ్రవరి 11: హైదరాబాద్‌మహా నగరంలో భారీ డ్రగ్స్‌రాకెట్ గుట్టురట్టయింది. నిందితులు ఒడిషాలో గంజాయి సాగు చేసి నగరంలో విక్రయించారు. హైదరాబాద్లో భారీగా గంజాయి రవాణా, విక్రయానికి పాల్పడుతున్న ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన మనీల్ దలబెహరా, ఇస్మాయిల్ రైతా అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

ఒడిశాలో గంజాయి సాగు..

మనీల్ దలబెహరా అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఒడిశాలో గంజాయి సాగు చేశాడు. ఆ గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో మేడ్చల్‌లో నివసిస్తున్న ఒడిశాకు చెందిన ఇస్మాయిల్ సహకారంతో నగరంలో సరఫరా చేశాడు. ఇస్మాయిల్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ.. గంజాయి విక్రయం నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

ప్రతిపక్షం,మొయినాబాద్, ఫిబ్రవరి 11: మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను బుధవారం తహసీల్దార్ గౌతమ్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం, చిల్కూర్, హిమాయత్ నగర్, అజీజ్ నగర్ వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకున్న భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, వృద్ధులు మరియు వికలాంగులకు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, ఎన్నికల రూట్ ఆఫీసర్ అశోక్, రెవెన్యూ సిబ్బంది భాస్కర్ రెడ్డి, జీపీవోలు పాల్గొన్నారు.

మహదేవప్ప కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుంది

- **మృతడి భార్యకు 10 లక్షల చెక్కును అందజేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 10: మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఆత్మహత్య చేసుకున్న ఎరుకలి మహదేవప్ప కుటుంబానికి బీజేపీ పూర్తి అండగా ఉంటుందని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. అన్ని విధాల కుటుంబాన్ని అండగా ఉండి ఆదుకుంటామన్నారు. మంగళవారం ఆత్మహత్య చేసుకున్న మహదేవప్ప కుటుంబాన్ని బుధవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, స్థానిక బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, కొండయ్యతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్ గ్రామంలో మృతుడి కుటుంబాన్ని ఇంటికి వెళ్లి భార్య సత్యమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ పక్షాన రూ. 10 లక్షల చెక్కును మృతుడి భార్య సత్యమ్మకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నుండి పోటీ చేసిన ఎరుకలి మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. పార్లమెంటు సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ తాను తెలుగులో మాట్లాడడం జరిగిందని ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే అలా మాట్లాడాలని అన్నారు. తాను పార్లమెంటులో ఎరుకలి మహదేవ ఆత్మహత్య సంఘటనను ప్రస్తావించిన తక్షణమే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మక్తల్ వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించమని ఆదేశించారని తెలిపారు. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు రాత్రి మక్తల్ రావడం జరిగిందన్నారు. రాజకీయాల్లో బెదిరింపులు దిగడం మంచిది కాదని అన్నారు. మహదేవప్ప మరణం బాధాకరమని ఆ కుటుంబం అధైర్యపడకుండా కుటుంబానికి బీజేపీ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సంఘటన పై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కేంద్ర మంత్రి గంగిపురం కిషన్ రెడ్డి సూచించారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంబడి బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కొండయ్య, కొత్త కాపు రతంగపాండు రెడ్డి, స్థానిక నాయకులు జి. బలరాంరెడ్డి, జయానందన్ రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, బ్యాటరీ రాజు పాల్గొన్నారు.

గీతం హ్యూమానిటీస్ డీన్‌గా డాక్టర్ రతిన్ రాయ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 11 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జి.ఎస్.హెచ్.ఎస్.) డీన్ గా డాక్టన్ రతిన్ రాయ్ నియమితులయ్యారు. గీతం అనుబంధ కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి.)లో విశిష్ట ఫెలో అయిన డాక్టర్ రాయ్ ప్రపంచవ్యాప్తంగా గౌరవనీయమైన ఆర్థికవేత్త, పబ్లిక్ పాలసీ పండితుడే గాక విద్యా, పబ్లిక్ ఫైనాన్స్, అంతర్జాతీయ అభివృద్ధిలో అత్యుత్తమ నాయకత్వం వహించారు.కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్ లో డాక్టర్ రాయ్ పీహెచ్.డీ., ఎం.ఫిల్. పట్టాలను పొందారు. ప్రస్తుతం ఆయన లండన్ లోని ఓవర్సీస్ డెవలప్ మెంట్ ఇన్ స్టిట్యూట్ (ఓడీఐ గ్లోబల్) లో విజిటింగ్ సీనియర్ ఫెలోగా సేవలందిస్తున్నారు. ఆయన విశిష్ట కెరీర్ లో నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్.ఐ.పి.ఎఫ్.పి.) డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా, బ్రెజిల్ లోని యు.ఎన్.డి.పి. లోని ఇంటర్నేషనల్ పాలసీ సెంటర్ ఫర్ ఇన్ క్లూజివ్ గ్రోత్ (ఐ.పి.సి.ఐ.జి)లో డైరెక్టర్ వంటి ప్రముఖ పదవులలో రాణించారు. వీటికి అదనంగా, డాక్టర్ రాయ్ ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమంలో అనేక సీనియర్ సలహాదారు పదవులను నిర్వహించారు. భారతదేశ 13వ ఆర్థిక కమిషన్ కు ఆర్థిక సలహాదారుగా, భారత ప్రధానమంత్రికి ఆర్థిక సలహా మండలి సభ్యుడిగా జాతీయ విధానానికి డాక్టర్ రాయ్ విస్తృతంగా దోహదపడ్డారు. డాక్టర్ రాయ్ నియామకం జి.ఎస్.హెచ్.ఎస్.కు ఒక ముఖ్యమైన మైలు రాయిని సూచిస్తుంది. ఆయన మేధో నాయకత్వం, గొప్ప విధాన అనుభవం, ప్రపంచ దృక్పథం, విద్యా నైపుణ్యం, పరిశోధన ఆవిష్కరణ, సంస్థాగత వృద్ధిని గణనీయంగా బలోపేతం చేస్తాయని భావిస్తున్నారు.డాక్టర్ రతిన్ రాయ్ నియామకాన్ని గీతం నాయకత్వం హృదయపూర్వకంగా స్వాగతించింది. ఆయన దార్శనిక నాయకత్వం, గీతం విద్యా సమాజానికి విలువైన తోడ్పాటును అందించగలదని వారు ఆశాభావం వ్యక్తపరిచారు.



ఇరవై నెలల కూటమి పాలనలో విభేదాలు లేవు. మన ఐకమత్యంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం. నిబద్ధత లేకపోతే ఫలితాలు రావు. పెండింగ్ పనులను నా దృష్టికి తీసుకురండి. జిల్లాల వారీగా నేతలు, అధికారులతో సమావేశం పెడతా. అసెంబ్లీ సమావేశాలను సీరియస్‌గా తీసుకోవాలి. 9 నుంచి 1గంట వరకు సభ్యులంతా సభలో ఉండాలి. ఎమ్మెల్యేల ప్రసంగాలు వింటా.. మంత్రుల సమాధానాలు చూస్తా. అసెంబ్లీని నేను కూడా పూర్తిగా గమనిస్తా.

\- ఏపీ సీఎం చంద్రబాబు

ఓపెన్ వాయిస్

దారి లేక.. దారికొచ్చిన పాక్

రోజుకో మలుపు తిరిగిన భారత్ పాకిస్థాన్ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఎట్టకేలకు జరగనుంది. బంగ్లాదేశ్‌తో మొదలైన ఈ వివాదం చిలికి చిలికి ఓ పెద్ద గాలివానలా మారింది. బంగ్లాదేశ్‌ను టీ20 వరల్డ్‌కప్ నుంచి బహిష్కరించిన తర్వాత భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమంటూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు భీష్మించుకుని కూర్చుంది. పాక్ తీరు చూసి దాయాదుల పోరు జరగదేమో అని అందరూ అనుకున్నారు. కానీ ఓ అదృశ్య శక్తి ఎంట్రీతో పాక్ తోకముడవక తప్పలేదు. టీ ట్వంటీ ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న పాకిస్తాన్ చర్యపై ఆ దేశంలో విస్తృత చర్చ జరుగుతోంది. ఆ దేశపు క్రికెటర్లు అనేకమంది దీనిని 'పాక్ విజయం'గా చెప్పుకుంటున్నారు. ఈ నిర్ణయంతో పాకిస్తాన్‌తోపాటు మిత్రదేశాల క్రికెట్‌కు మేలు జరుగుతుందని పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. "ఇప్పుడిక దీనిపై రాజకీయాలు అనవసరం. ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించాలి. మేమే గెలిచామని వాళ్లుగానీ, వీళ్లుగానీ చెప్పకూడద" అని అహ్మద్ షాజాద్ చెప్పారు. "భారత్‌కు మాతో సమస్య ఉంటే, మాతో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించేది. కానీ వాళ్లలా చేయలేదు. పాకిస్తాన్ మ్యాచ్ ఆడేలా ఐసీసీ ఒప్పించింది. అంటే పాక్ లేకుండా క్రికెట్ టోర్నీ నడవదని వారికి తెలుసు. క్రికెట్‌కు మా అవసరం ఉంది. మా మిత్ర దేశాల కోసమే మేమీ నిర్ణయం తీసుకున్నాం. ఇది మంచి నిర్ణయం. ఇందులో మేం గెలిచాం" అని పాక్ మాజీ క్రికెటర్ సికిందర్ బఖ్త్ అన్నారు. దీనిపై స్పందించిన బీసీసీఐ, సమస్యను పరిష్కరించడంలో ఐసీసీ పాత్రను కొనియాడింది. "ఈ చర్చల ద్వారా బంగ్లాదేశ్ సెంటిమెంట్లను కూడా గౌరవించారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు కొంత ఉపశమనం లభించింది. వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారు. ఐసీసీ ప్రయత్నాలను వాళ్లు కూడా అభినందిచారు" అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నారు. టీ ట్వంటీ వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 15న భారత్‌తో ఆడాల్సిన మ్యాచ్ ఆడేందుకు పాక్ జట్టుకు అనుమతి ఇస్తూ ప్రధాని షాబాజ్ షరీఫ్ నిర్ణయం తీసుకున్నారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీ ప్రతినిధులు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సభ్యుల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం గురించి ప్రధాని షాబాజ్ షరీఫ్‌కు పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వీ వివరించారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అభ్యర్థనలు, శ్రీలంక క్రికెట్ బోర్డు రాసిన లేఖలు, యూఏఈ, ఇతర సభ్య దేశాల సందేశాల ఆధారంగా పాకిస్తాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీబీసీ ఉర్దూ తెలిపింది. భారత్‌తో మ్యాచ్ విషయంలో పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస నాయకే కృతజ్ఞతలు తెలిపారు. మరో వైపు పాకిస్థాన్ రోజుల వ్యవధిలోనే తన మనసు మార్చుకొని, భారత్‌తో మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఐసీసీ చీఫ్‌గా ఉన్న జై షా పాకిస్థాన్ క్రికెట్ బోర్డును అష్ట దిగ్బంధనం చేశాడని చెప్పొచ్చు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇచ్చే రెవెన్యూ వాటాను ఆపేస్తామని, దీర్ఘకాలంపాటు ఆంక్షలు విధిస్తామని ఐసీసీ హెచ్చరించింది. మరోవైపు బ్రాడ్‌కాస్టర్ సైతం రంగంలోకి దిగి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీబీకి వార్నింగ్ ఇచ్చింది. అదే జరిగితే నష్ట పరిహారంగా పీసీబీ భారీ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. ఓవైపు ఐసీసీ నుంచి వచ్చే ఆదాయం ఆగిపోయి, మరోవైపు బ్రాడ్‌కాస్టర్‌తో న్యాయపోరాటం చేయాల్సి వస్తే.. పీసీబీ ఆర్థిక కష్టాలు మామూలుగా ఉండవు. ఇక భారత్‌లో టీ20 వరల్డ్ కప్ ఆడబోమంటూ టోర్నీ నుంచి బయటకు వెళ్లిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా.. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పీసీబీకి రిక్వెస్ట్ చేసింది. క్రికెట్ మంచి కోసం ఆడండి అని పైకి చెప్పినప్పటికీ.. అసలు కారణాలు మాత్రం వేరే. ఇప్పుడు పాకిస్థాన్ కనుక భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్‌తోపాటు టోర్నీ నుంచి అర్ధంతరంగా వైదొలిగిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుపైనా ఐసీసీ కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం. అదే జరిగితే రెండు బోర్డులూ తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటాయి. ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికి బీసీబీ పాక్‌ను వాడుకుంది. బీసీబీపై పెనాల్టీ విధించొద్దని, భారత్ తమ దేశంలో మ్యాచ్‌లు ఆడకపోవడం వల్ల రెవెన్యూ తగ్గుతోంది కాబట్టి.. తమ రెవెన్యూ వాటా పెంచాలని.. భవిష్యత్తులో అండర్ 19 వరల్డ్ కప్ లాంటి టోర్నీలను బంగ్లాదేశ్‌లో నిర్వహించేలా చూడాలన్న పీసీబీ డిమాండ్ చేసింది. అయితే బీసీబీపై జరిమానా విధించకుండా ఉండటం, జూనియర్ ఐసీసీ ఈవెంట్లకు బంగ్లా ఆతిథ్యం ఇవ్వడం పట్ల ఐసీసీ సానుకూలంగా స్పందించింది. ఓవైపు బ్రాడ్‌కస్టర్‌తో వార్నింగ్‌లు, రెవెన్యూ వాటాను ఆపేస్తామని ఐసీసీ హెచ్చరికలు.. శ్రీలంక, యూఏఈ క్రికెట్ బోర్డులు రాసిన లేఖలు.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సైతం ఆడమని కోరడం.. ఇవన్నీ కలిసి పాకిస్థాన్‌కు మరో దారి లేకుండా చేశాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
12.02.2026

విదేశీ విద్య: మధ్యతరగతికి అప్పుల ఊబి?

ప్రస్తుతం మన మధ్యతరగతి కుటుంబాలు ఒక ప్రమాదకరమైన జూదం ఆడుతున్నాయి. విదేశీ డిగ్రీ అనేది ప్రతిసారీ లాభం ఇచ్చే పెట్టుబడి కాదు. అప్పు తీసుకునే ముందే అది ఎంతవరకు అవసరమో పది సార్లు ఆలోచించండి. గుర్తుంచుకోండి విదేశీ విద్య కోసం చేసే అప్పు అనేది ఒక వ్యూహంతో కూడిన నిర్ణయం కావాలి కానీ, కేవలం సామాజిక హోదా కోసం తీసుకునే ఆవేశపూరిత నిర్ణయం కాకూడదు. సమయానికి మేల్కొకపోతే, మన పిల్లల చదువుల కల (Degree Dream) కాస్తా, జీవితాంతం వెంటాడే అప్పుల కలత (Debt Nightmare) గా మారే ప్రమాదం ఉంది.

డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

గడచిన పదేళ్లలో భారతీయ మధ్యతరగతి కుటుంబాల్లో ఒక ఆసక్తికరమైన మార్పు కనిపిస్తోంది. తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని నమ్మి, కోట్ల రూపాయల విద్యా రుణాలు తీసుకోవడం ఇప్పుడు ఒక కొత్త ట్రెండ్గా మారింది. ముఖ్యంగా అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో డిగ్రీ ఉంటే చాలు, జీవితం సెటిల్ అయిపోయినట్లే అని చాలామంది భావిస్తున్నారు. కానీ, ఈ పెట్టుబడి నిజంగా అంత సురక్షితమేనా? లేక ఇది కూడా 2008 నాటి అమెరికన్ సబ్‌ప్రైమ్ సంక్షోభం లాగా మన దేశంలో మరో ఆర్థిక ఇబ్బందికి దారితీస్తుందా? ఈ విషయాన్ని ఇప్పుడు మనం సీరియస్గా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఒక్కసారి రిజర్వ్ బ్యాంక్ (RBI) డేటాను గమనిస్తే షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయి విద్యా రుణాలు ఏకంగా 300% పెరుగుదల కనిపిస్తుంది, 2019 నుంచి 2024 మధ్య కాలంలో విదేశీ విద్యా రుణాలు ఏకంగా మూడు రెట్లు పెరిగాయి. బ్యాంకులు 2023-24లోనే దాదాపు 1.2 లక్షల కోట్ల లోన్లు ఇస్తే, అందులో 65% కేవలం విదేశాలకు వెళ్లే విద్యార్థులకే అందాయి. సగటు అప్పు చూస్తే ఒక్కో విద్యార్థిపై సగటున 3040 లక్షల అప్పు ఉంటోంది. అదే ఒకవేళ టాప్ యూనివర్సిటీ అయితే, ఆ అంకె 60 80 లక్షలకు చేరుతోంది. ఉదాహరణకు, అమెరికాలో మాస్టర్స్ (STEM) చేయాలంటే రెండేళ్లకు కలిపి కనీసం $80,000 నుండి $120,000 అంటే మన ఊహకు అందనంతగా, సుమారు 65 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఖర్చవుతోంది. తల్లిదండ్రులు ఈ విదేశీ డిగ్రీని ఒక గోల్డెన్ టికెట్ లాగా చూస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం చాలా భిన్నంగా ఉంది, విదేశీ డిగ్రీ ఉంటే చాలు భారీ ప్యాకేజీ వస్తుందనేది ఒకప్పటి మాట. కానీ నేటి పరిస్థితి చూస్తే భయం వేస్తోంది, గత రెండేళ్లలోనే మెటా, గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ కంపెనీలు దాదాపు 4 లక్షల మందిని ఇంటికి పంపేశాయి. దీనికి తోడు వీసా కష్టాలు కూడా పెరిగాయి. అమెరికా H1B వీసాల అప్రూవల్ రేటు 75% నుండి 57%కి పడిపోయింది. కెనడాలో ప్రస్తుతం 9 లక్షల మంది విదేశీ విద్యార్థులు ఉన్నారు. కానీ అక్కడ నిబంధనలు కఠినతరం కావడంతో, చదువు అయ్యాక వర్క్ పర్మిట్ రావడం, పర్మనెంట్ రెసిడెన్సీ (PR) సంపాదించడం ఇప్పుడు ఆకాశానికి నిచ్చెన వేయడమే అవుతోంది. అమెరికాలో మాస్టర్స్ చేశాక సగటున 7085 వేల డాలర్ల జీతం రావచ్చు. కానీ చేతికొచ్చే జీతంలో ట్యాక్సులు, అక్కడ ఉండటానికి అయ్యే ఖర్చులు పోతే, తీసుకున్న 750 లక్షల అప్పు తీర్చడానికే 5 ఏళ్లు పడుతోంది. అది కూడా ఉద్యోగం ఊడకుండా ఉంటేనే! అప్పట్లో అమెరికాలో జరిగిన సబ్‌ప్రైమ్ క్రైసిస్కు, ఇప్పుడు మన దగ్గర ఉన్న ఎడ్యుకేషన్ లోన్లకు మధ్య కొన్ని భయంకరమైన పోలికలు ఉన్నాయి, అతి విశ్వాసం తో అప్పట్లో ఇళ్ల ధరలు పెరుగుతాయని నమ్మి స్తోమతకు మించి అప్పులు చేసి ఇళ్లు కొన్నారు. ఇప్పుడు కూడా విదేశీ డిగ్రీ విలువ ఎప్పటికీ తగ్గదని, గ్యారెంటీగా రాబడి వస్తుందని నమ్మి తల్లిదండ్రులు తమ శక్తికి మించి అప్పులు చేస్తున్నారు. ఈ సందర్భాల్లోనూ మనం భవిష్యత్తులో వచ్చే ఆదాయం మీద ఆశపడి ఈరోజే అప్పుల్లో కూరుకుపోతున్నాం. మనం విద్య ఋణం కు పోయినపుడు నిజాలు దాచి, బ్యాంకులు, కన్సల్టెన్సీలు కేవలం గెలిచిన వారి కథలనే వినిపిస్తాయి. కానీ ఉద్యోగం రాక,

వీసా దొరక్క అప్పుల ఊబిలో కూరుకుపోయిన వేలమంది విద్యార్థుల బాధలు ఎవరికీ వినిపించవు. అప్పట్లో రిస్క్ను ఎలాగైతే దాచారో, ఇప్పుడు కూడా విద్యా రుణాల వెనుక ఉన్న అసలు రిస్క్ ను అలాగే దాచేస్తున్నారు. డిగ్రీల వెల్లువ (Global Degree Inflation), ఇప్పుడు మాస్టర్స్ డిగ్రీ అనేది ఒక సాధారణ విషయమైపోయింది. అమెరికాలోనే ప్రస్తుతం విద్యార్థులు అప్పు మొత్తం దాదాపు $1.77 ట్రిలియన్లకు చేరిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. AI & ఆటోమేషన్ భయం కూడా ఇప్పుడు చుస్తే ChatGPT వంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ రావడంతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ఒకప్పుడు ఫుల్ డిమాండ్ ఉన్న డేటా సైన్స్, సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్లో కూడా ఇప్పుడు పోటీ విపరీతంగా పెరిగిపోయింది. ధనవంతులు సొంత డబ్బుతో చదువుకుంటారు, పేదలకు స్కాలర్షిప్స్ వస్తాయి. కానీ మిడిల్ క్లాస్ మాత్రం సొంత ఇంటిని తాకట్టు పెట్టి మరీ అప్పులు చేస్తోంది. వారికి వేరే దారి (Financial cushion) లేదు. సోషల్ ప్రెజర్ కూడా తోడుకావటం తో పక్కింటి అబ్బాయి అమెరికా వెళ్లాడని, బంధువుల్లో ఎవరో ఆస్ట్రేలియా వెళ్లారని, కేవలం సామాజిక గౌరవం కోసం ఆలోచించి తీసుకుంటున్న ఎమోషనల్ నిర్ణయాలే తప్ప, ఇందులో నిజమైన ఆర్థిక ప్రణాళిక ఉండటం లేదు. గణాంకాలు చుస్తే 2010-15 మధ్య విదేశాలకు వెళ్లిన వారిలో 80% మంది సెటిల్ అయ్యేవారు. కానీ 2020 తర్వాత వెళ్లిన వారిలో సగం మందికి కూడా ఆ అదృష్టం దక్కడం లేదు. నిజానికి విద్యా రుణాలు ఇప్పుడు కేవలం వ్యక్తిగత అప్పులుగా మిగిలిపోలేదు. ఇవి ఒక పెద్ద ఆర్థిక, సామాజిక సంక్షోభానికి దారితీసేలా ఉన్నాయి. ఇప్పటికే విద్యా రుణాల్లో మొండి బకాయిలు 79% వరకు ఉన్నాయి. కానీ రాబోయే ఐదేళ్లలో ఇది 20%కి పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంటే, ప్రతి ఐదుగురిలో ఒకరు అప్పు కట్టలేని పరిస్థితి రావచ్చు. ఇప్పుడు కొన్ని ఫిన్టెక్ (Fintech) కంపెనీలు తాకట్టు ఏమీ లేకుండానే లోన్లు ఇస్తున్నాయి. కానీ అవి వసూలు చేసే వడ్డీ మాత్రం 18-22% వరకు ఉంటోంది. ఇంత భారీ వడ్డీలు కట్టలేక మధ్యతరగతి జనాలు కుప్పకూలిపోయే అవకాశం ఉంది. తల్లిదండ్రుల త్యాగం చుస్తే తమ రిటైర్మెంట్ కోసం దాచుకున్న సొమ్మును, కష్టపడి కట్టుకున్న ఇళ్లను పిల్లల చదువుల కోసం తాకట్టు పెడుతున్నారు. ఆ EMIలు కట్టలేక వృద్ధాప్యంలో ప్రశాంతత లేకుండా గడుపుతున్నారు. బ్యాంకులు, యూనివర్సిటీలు కేవలం 'కలల ప్రపంచాన్ని' చూపడం మానేయాలి. అక్కడ చదివిన వారికి సగటున ఎంత జీతం వస్తోంది? ఎంతమందికి ఉద్యోగాలు రావడం లేదు? ఇలాంటి లెక్కలన్నీ పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉంచాలి. ఆర్థిక అవగాహన (Financial Literacy) కల్పించాలి చదువు కోసం లోన్ తీసుకునే ముందే. ఆ అప్పు ఎలా తీర్చాలి? ఎంత వడ్డీ పడుతుంది? రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్మెంట్ (ROI) ఎలా లెక్కించాలి? అనే విషయాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు నేర్పించాలి. జీతం బట్టి లోన్ కట్టే కిస్తీలు (IncomeBased Repayment) ఉండాలి విద్యార్థికి ఉద్యోగం వచ్చాక, తన జీతానికి అనుగుణంగా EMI మార్చుకునే సదుపాయం ఉండాలి. దీనివల్ల ఆర్థికంగా కుంగిపోకుండా ఉంటారు. మన దేశంలోనే మేలైన చదువు కోసం IIT, IIM స్థాయి నాణ్యమైన విద్యాసంస్థలను మరిన్నింటిని మన దేశంలోనే పెంచాలి. అప్పుడు పిల్లలు కోట్ల రూపాయలు పోసి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. నైపుణ్యానికే విలువ ఇవ్వాలి, కేవలం డిగ్రీలకే కాకుండా, విద్యార్థి దగ్గర ఉన్న అసలు 'స్కిల్స్' కు విలువ ఇచ్చే జాబ్ మార్కెట్ రావాలి. ఈ విషయంలో ప్రభుత్వ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి విద్యా రుణాలపై RBI ప్రత్యేక నిబంధనలు తీసుకురావాలి. అలాగే ఉద్యోగం పోయినా లేదా అనారోగ్యం పాలైనా ఆ అప్పు భారం పడకుండా లోన్ ఇన్సూరెన్స్ పథకాలు ఉండాలి. ప్రస్తుతం మన మధ్యతరగతి కుటుంబాలు ఒక ప్రమాదకరమైన జూదం ఆడుతున్నాయి. విదేశీ డిగ్రీ అనేది ప్రతిసారీ లాభం ఇచ్చే పెట్టుబడి కాదు. అప్పు తీసుకునే ముందే అది ఎంతవరకు అవసరమో పది సార్లు ఆలోచించండి. గుర్తుంచుకోండి విదేశీ విద్య కోసం చేసే అప్పు అనేది ఒక వ్యూహంతో కూడిన నిర్ణయం కావాలి కానీ, కేవలం సామాజిక హోదా కోసం తీసుకునే ఆవేశపూరిత నిర్ణయం కాకూడదు. సమయానికి మేల్కొకపోతే, మన పిల్లల చదువుల కల (Degree Dream) కాస్తా, జీవితాంతం వెంటాడే అప్పుల కలత (Debt Nightmare) గా మారే ప్రమాదం ఉంది. ఇది కేవలం ఒక కుటుంబం సమస్య కాదు, మన దేశ ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న!

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

సత్యార్థ ప్రకాశకులు స్వామి దయానంద సరస్వతి

సుధాకర్.ఏ.వి
9000674747

అజ్ఞానాంధకారం, దారిద్ర్యం, అన్యాయాన్ని ఎదురించి పోరాడిన ముని. హిందు ధర్మ సంస్థాపనకు నడుం బిగించిన ఋషి. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి, ఎందరో స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణ అయిన పండితుడు, ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి. ఈయన అసలు పేరు మూలశంకర్. మూల శంకర్ 1824 ఫిబ్రవరి 12లో గుజరాత్ లోని ఠంకార అనే గ్రామంలో ఒక వర్తక కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి ఒక మహా శివ భక్తుడు, పద్నాలుగేళ్ల ప్రాయంలో ఒక శివరాత్రి నాడు శివ లింగంపై విసర్జిస్తున్న మూషికాలను చూసి, ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు గ్రహించి 1846లో భగవంతుడిని వెతకడానికి ఇల్లు వదిలి వెళ్లాడు. ఈ ప్రయాణంలో ఎందరో యోగులు, మునుల సాంగత్యంలో గడిపి దయానంద అన్న నామం పొందాడు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథుర లోని స్వామి విరజానంద సరస్వతి కడకు చేరుకున్నాడు. అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించడానికి బయలుదేరాడు.

ప్రయాణ మార్గంలో దేశ స్థితిగతులు, దీనమైన, శోచనీయమైన హిందు సమాజంపై అవగాహన చేసుకున్నాడు. భారతావని ఆంగ్లేయుల పాలనలో ఉంది. ఒకప్పుడు విశ్వమానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన దేశం ఇప్పుడు, అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులెడుతుండడం చూసి శోకించాడు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ముక్కలు అవుతోంది. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్యవివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛనీయమైన ఆచారాలు చూసి, చలించి పోయి వాటిని ఛేదించడానికి పాఖండ ఖండిని అన్న పతాకాన్ని ఆవిష్కరించాడు.

వేదాలు మానవులు రచించినవి కావనీ, సాక్షాత్తూ పరమాత్మ నుండే ఉద్భవించాయని బలంగా నమ్మిన వీరు 'సత్యార్థ ప్రకాశ్' పేరుతో వేదాల సారాన్ని సామాన్యుడి దాకా చేర్చే ప్రయత్నం చేశారు. అంతటితో ఆగకుండా వేదాలను ఆధునిక కోణంలో చూడాలన్న దృక్పథంతో వేదాలకు వీరు రాసిన భాష్యం 'దయానంద భాష్యం' పేరుతో సుప్రసిద్ధమైంది. వేదాలు చెప్పిన స్త్రీ సమానత్వం గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. వేదాలతో పాటు ప్రాథమిక విద్య అవసరాన్ని గుర్తించి అనేక కళాశాలలు నెలకొల్పి విద్యాదానం చేశారు. జాతీయవాదిగా తన బోధనలతో భారతదేశాన్ని సాంఘికంగా, మతపరంగా సంఘటిత పరచి ప్రజలలో దేశభక్తిని, జాతీయభావాన్ని



పెంపొందించేలా అవిరళ కృషి సల్పి, హిందూధర్మానికి దయానందులు చేసిన సేవ తరువాతి సమాజ సంస్కర్తలకు ఆదర్శంగా నిలిచింది.

భారతదేశాన్ని, హిందు సమాజాన్ని జాగృత పరచాలని సంకల్పించి ఎన్నో పురోగామి సంస్కరణలు చేపట్టాడు. అందులో భాగంగా సతి, బాల్య వివాహాలు, అంటరానితనం, వరకట్న దురాచారాన్ని బహిష్కరించాడు. స్త్రీ విద్య పరిచయం చేసాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం పోవాలని నమ్మి (స్వరాజ్) స్వయం పరిపాలన అని మొదటి సారి గొంతెత్తినాడు. దయానందుడు వ్రాసిన సత్యార్థ ప్రకాశ్ లో భారతదేశం నుండి సమస్త భారతీయుల మనసులలోని మూఢ నమ్మకాలు, అంధవిశ్వాసాల నిర్మూలన గూర్చి వ్యాఖ్యానించాడు. స్త్రీలకు సైనిక శిక్షణ ఇవ్వడం అనే ప్రతిపాదనను ప్రథమంగా తీర్మానించినది స్వామి దయానందనే. సత్యార్థ ప్రకాశ్ ద్వారా వేదాల విశ్లేషణ, మూఢ నమ్మకాలను ప్రక్షాళన చేయుట వంటి వాటిని ప్రచురిస్తూ ప్రజల మన్నలను పొందాడు. ధార్మిక జీవనం కొనసాగిస్తూ వేద సారాంశాల గురించి ఉపన్యాసాలిస్తూ జీవనం కొనసాగించాడు.

ధర్మ సంస్థాపనకు శాశ్వత సంస్థగా, దేశ సంఘసంస్కరణకు పునాదిగా, 1875 ఏప్రిల్ 10న ముంబాయి నగరంలో మొదటి ఆర్యసమాజం స్థాపించాడు. హిందూధర్మాన్ని పునరుద్ధరిద్దాం (హిందూధర్మం ప్రత్యాగచ్ఛత) అన్న పిలుపుకు నాంది పలికాడు. ఆర్యసమాజం చేపట్టిన కార్యక్రమాల్లో శుద్ధి ఉద్యమాలు చాలా ప్రాచుర్యం పొందాయి. ఆ రోజుల్లో మతం మారిన హిందువులను తిరిగి స్వధర్మంలోకి తీసుకు రావడం ఒక సంచలనం. వీరికి మంత్ర దీక్ష ఇచ్చి యజ్ఞం చేయించి తిరిగి హిందువులుగా మారినట్లు ప్రకటిస్తారు. శుద్ధి ఉద్యమం ఫలితంగా ఇస్లాం, క్రైస్తవ మతాల్లో చేరిన ఎంతోమంది హిందూ సోదరులు తిరిగి హిందువులుగా మారారు. ఒకసారి మతం మారిన హిందువు తిరిగి స్వధర్మంలోకి రాలేడు అనే భ్రమను ఆర్య సమాజ్ దూరం చేసింది.

హైదరాబాద్‌లో ఆర్యసమాజ్ రాజకీయ, సాంఘిక ఉద్యమాలను పెద్ద ఎత్తున చేపట్టింది. స్వేచ్ఛ, మత, భాషాపరమైన హక్కుల కోసం ఆర్యప్రతనిధి సభ, ఆర్య రక్షా సమితిల ఆధ్వర్యంలో 8 సత్యాగ్రహాలు జరిగాయి. ఈ సత్యాగ్రహాల్లో 40 వేల మంది జైలుకు వెళ్లారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ సూచన మేరకు భయ్యాజీ దాణే, వామన హెడ్గేవార్ తదితర స్వయంసేవకులు ఈ సత్యాగ్రహాల్లో పాల్గొన్నారు. స్వామి రామానందతీర్థ, పండిత నరేంద్ర, యశ్వంతరావు జోషి, కేశవరావ్ కోరట్కర్, వినాయక రావు విద్యాలంకార్, వందే మాతరం రామచంద్రరావు, పండిత గోపదేవ శాస్త్రి తదితరులు ఎందరినో ఆర్యసమాజ్ అందించింది. చివరి నిజాం పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ మీద బాంబు విసిరిన నారాయణరావు పవార్ ఆర్యసమాజీయుడే. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇప్పటికీ ఆర్యసమాజ్ శాఖలు పని చేస్తున్నాయి.

ఇలా అనేక కార్యక్రమాలను చేపట్టడం వల్ల దయానంద సరస్వతి పెక్కుమందికి కంట్లో నలుసు అయ్యాడు. ఏడు సార్లు విషప్రయోగాలు జరిగినను బస్తి, న్యోళి అనే యోగ ప్రక్రియ ద్వారా ప్రేగులను ప్రక్షాళనం చేసుకుని వాటిని విఫలం చేసినను, చివరిసారిగా 1883 అక్టోబరు 30న దీపావళి రోజు సాయంత్రం జరిగిన విష ప్రయోగంతో క్షీణిస్తూ ఓంకారనాదంతో సమాధి అవస్థలో మోక్షాన్ని పొందాడు. అతను తన వాదనలను, ఉద్యమాన్ని సమర్థిస్తూ అథర్వణ, యజుర్వేదం వంటివి భాష్యం చేసిన వేద భాష్యకారుడు.

(ఫిబ్రవరి 12 స్వామి దయానంద సరస్వతి జయంతి)

అడవి 'నాయక'త్వం.. ధర్మపోరాటంలో ఆదిమ వీరత్వం!

వెంక గారి భూమయ్య
9848559863

భారతీయ ఇతిహాసం అంటే కేవలం కురుపాండవుల రక్తపాతం మాత్రమే కాదు.. అది అడవికీ, అగ్రవర్ణ నాగరికతకూ మధ్య జరిగిన అద్భుత సమన్వయం. పట్టు పరుపుల మీద పెరిగిన పాండవ మధ్యముడు 'భీముడు'.. అడవిని నమ్ముకున్న ఆదిమ వీరవనిత 'హిడింబి' పాదాల చెంత మోకరిల్లిన నాడే మహాభారత గమనంలో ఒక నవశకం మొదలైంది. కానీ, దురదృష్టవశాత్తూ మన చరిత్రకారులు అడవి బిడ్డల త్యాగాలను 'రాక్షస' ముద్ర వేసి అగాధంలోకి తొక్కేశారు. నాయక పోడ్లు అనే గిరిజన వీర తెగ ప్రస్తావన లేని పాండవ వనవాసం ఒక అసంపూర్ణ కావ్యం.

రాక్షసత్వం కాదు.. అది రక్షణ కవచం!

వారణావతపు కుట్రల నుంచి ప్రాణాలతో బయటపడి, నిప్పులు చెరిగే కళ్లతో అడవిలోకి అడుగు పెట్టిన పాండవులకు ఆశ్రయమిచ్చింది పచ్చని ప్రకృతి మాత్రమే కాదు, ఆ ప్రకృతిని కంటికి రెప్పలా కాపాడుకునే నాయక పోడ్లు. హిడింబిని 'రాక్షసి' అని పిలవడం ఆమెను అవమానించడమే. ఆమె ఒక రాజ్యానికి వారసురాలు, ఒక తెగకు ఆశాకిరణం, యుద్ధ తంత్రం తెలిసిన వీరనారి. పరాయి వ్యక్తులు తమ అడవిలోకి అడుగుపెడితే గొడ్డలి పట్టే ఆమె తెగువ రాక్షసత్వం ఎలా అవుతుంది? అది తన మట్టిని కాపాడుకునే మాతృత్వపు ఆవేదన. భీముడి భుజబలాన్ని చూసి మోహించడమంటే, ఒక వీరుడికి మరో వీరవనిత ఇచ్చిన అత్యున్నత గౌరవం.

పోడు వ్యవసాయం - అక్షయపాత్ర సిద్ధాంతం

నాగరిక ప్రపంచానికి కొండల మీద వ్యవసాయం చేయడం అంటే అద్భుతం కావచ్చు, కానీ నాయక పోడ్లకి అది జీవనవేదం. పాండవుల వనవాస కాలంలో వారికి ఆకలి తీర్చింది అక్షయపాత్ర మాత్రమే కాదు.. ఆ పాత్రలోకి ధాన్యాన్ని, కందమూలాలను చేర్చిన నాయక తెగ శ్రమ. కొండలను పిండి చేసి పంటలు పండించే పోడు సంస్కృతే పాండవుల మనుగడకు ప్రాణాధారమైంది. ద్రౌపదికి సౌగంధిక పుష్పాలు దొరికినా, అర్జునుడికి పాశుపతాస్త్రం లభించినా.. వాటన్నింటి వెనుక అడవి బిడ్డల అడుగుజాడలు ఉన్నాయి. సాక్షాత్తు పరమశివుడు కూడా అర్జునుడి గర్వాన్ని అణచడానికి ఒక 'కిరాతకుడి' (నాయక వేటగాడి) రూపంలో వచ్చాడంటే, ఆ తెగకున్న సామాజిక గౌరవం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

ఘటోత్కచుడు! ఒక జాతి త్యాగ నిరతికి పతాక!

మహాభారత సంగ్రామంలో అత్యంత విషాదకరమైన, వీరోచితమైన ఘట్టం ఏదైనా ఉంటే అది ఘటోత్కచుడి వీరమరణమే. రాజ్యాధికారం కోసం సోదరులు కొట్టుకుంటుంటే, ఏ సంబంధం లేని అడవి బిడ్డ తన తండ్రి పక్షాన నిలిచి కు



రుసేనను చీల్చి చెండాడాడు. కర్ణుడి వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని తన గుండెకు అడ్డుపెట్టుకుని అర్జునుడిని కాపాడిన ఆ ప్రాణ త్యాగం.. అడవి బిడ్డల విశ్వసనీయతకు నిదర్శనం. హిడింబి తన కొడుకును యుద్ధానికి పంపుతూ అడవి నేర్పిన నీతిని, ధర్మాన్ని గుండెల్లో నింపి పంపింది. ఒక తల్లిగా తన పేగును కోసుకుని ధర్మసంస్థాపన కోసం ఆహుతి ఇచ్చిన ఆ గొప్పతనం ఏ రాజకుమారికి ఉంటుంది?

నేటికీ సజీవం.. ఆ వీరగాథ!

తెలంగాణ నుంచి ఒడిశా వరకు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తరించిన నాయక పోడ్ల సంస్కృతి నేటికీ హిడింబిని 'వనదేవత'గా కొలుస్తోంది. పాలకుల నిర్లక్ష్యం వల్ల, చరిత్రకారుల వివక్ష వల్ల ఈ వీర చరిత్ర చీకటిలోనే ఉండిపోయింది. పాండవులకు రక్షణగా నిలిచిన ఆ వీర తెగ నేడు తమ ఉనికి కోసం, పోడు భూముల కోసం పోరాడాల్సి రావడం మన వ్యవస్థకే సిగ్గుచేటు. మహాభారతం ఒక సముద్రమైతే, అందులో నాయక పోడ్ల చరిత్ర ఒక సునామీ. హిడింబి ఆత్మగౌరవాన్ని, ఘటోత్కచుడి త్యాగాన్ని, పోడు సంస్కృతిలోని శ్రమను గుర్తించిన రోజే భారతదేశానికి తన మూలాల మీద గౌరవం పెరుగుతుంది. అడవి తల్లి సాక్షిగా.. ఈ సత్యం ఎప్పటికైనా వెలుగులోకి రావాల్సిందే!

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

మక్తల్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- భారీగా తరలివచ్చిన ఓటర్లు, 70.29 శాతం నమోదు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, ఫిబ్రవరి 11: నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీకి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం అత్యంత ఉత్సాహపూరితంగా, ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, గంట గంటకూ ఓటర్ల రాక పెరుగుతూ వచ్చింది. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ పోలింగ్‌లో పట్టణ ప్రజలు తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చారు. మొత్తం 21,892 మంది ఓటర్లు ఉన్న ఈ మున్సిపాలిటీలో 15,369 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనితో సగటున 70.29 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు ధృవీకరించారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పురుషుల (7,613) కంటే మహిళా ఓటర్లే (7,756) అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు వేయడం విశేషం. ఎన్నికల నేపథ్యంలో పలువురు కీలక నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి తన కుటుంబ సభ్యులతో కలిసి 7వ వార్డులోని 16వ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సైతం కుటుంబ సమేతంగా 1వ వార్డులోని రెండవ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక మక్తల్ ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి అని అన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య 7వ వార్డులోని 17వ బూత్‌లో కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు ఎవరు భయభ్రాంతుల గురి కాకుండా స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కుని మహిళలు యువత పెద్ద ఎత్తున వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. వివిధ పార్టీల రాజకీయ ప్రముఖుల రాకతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. వార్డుల వారీగా నమోదైన పోలింగ్ శాతం వివరాలను పరిశీలిస్తే పట్టణ ఓటర్ల మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. నాలుగో వార్డులో అత్యధికంగా 79.61 శాతం పోలింగ్ నమోదు కాగా, ఐదో వార్డులో అత్యల్పంగా 58.85 శాతం నమోదైంది. మిగిలిన వార్డుల పోలింగ్ శాతం ఇలా ఉంది: మొదటి వార్డు 79.43, రెండవ వార్డు 78.40, మూడవ వార్డు 73.01, ఏడవ వార్డు 69.58, ఎనిమిదవ వార్డు 61.95, తొమ్మిదవ వార్డు 68.59, పదవ వార్డు 72.21, 11వ వార్డు 78.55, 12వ వార్డు 69.94, 13వ వార్డు 65.68, 14వ వార్డు 75.29, 15వ వార్డు 62.97, మరియు 16వ వార్డులో 63.75 శాతంగా నమోదైంది.

ఓటు హక్కు వినియోగించు కున్న ప్రముఖులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 11: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో కరీంనగర్ 50వ డివిజన్‌లోని జ్యోతినగర్ ఎస్సార్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 361వ పోలింగ్ బూత్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్ నవ భారత్ హైస్కూల్ లో కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ 52వ డివిజన్‌లోని ట్రినిటీ బాలికల జూనియర్ కళాశాలలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో కరీంనగర్ ముఖరం పుర దన్ గార్ వాడి స్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మాజీ ఎంపీ బోయిన పల్లి వినోద్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా వారు వేర్వేరు గా మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధి, పారదర్శక పరిపాలన కోసం తమ ఓటు ద్వారా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు.

ఓటింగ్ లో పాల్గొన్న ట్రాన్స్ జెండర్లు

కామారెడ్డి జిల్లాలో 70 శాతం పోలింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 11: జిల్లా లోని నాలుగు మున్సిపాలిటీలలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 70 శాతం పోలింగ్ నమోదైంది. ఓటర్లు ఉత్సాహం గా ఓటింగ్ లో పాల్గొన్నారు. కామారెడ్డి, బాన్సువాడాలో చెదురుముదురు ఘటనలు జరిగాయి.జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర లు సందర్శించి పరిశీలించారు. జిల్లాలో ఉదయం నుంచే ప్రారంభమైన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైందని ,పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ,జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా పోలింగ్ లో పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ర్యాంపులు, వీల్ చైర్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని , పోలింగ్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ,పారదర్శకంగా కొనసాగిందని, పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 .00 గంటల వరకు కొనసాగిందని, అర్హులైన ప్రతి ఓటరు తమ సమీప పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. బాన్సువాడ లో 19 వార్డులు, 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రశాంత వాతావరణం లో పోలింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా కొనసాగిందని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ లలో వార్డులు, పోలింగ్ బూతుల వారీగా నిర్దేశిత క్రమ సంఖ్యలో బ్యాలెట్ బాక్స్ లను అమర్చాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లెక్కింపు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు.కాగా పోలింగ్ ముగిసాకా అభ్యర్థులు గెలుపు ఓటములపై ఎవరి అంచనాల్లో వారు లెక్కలు వేసుకుంటున్నారు.

కరీంనగర్‌లో ఉద్రిక్తత

- బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 11: కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి నిర్వహించారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అందులో ఆరుగురు బీజేపీ కార్యకర్తల చేతులు విరిగినట్లు సమాచారం. పోలీసుల చర్యపై బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 58వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నారని తమ ఫిర్యాదును పట్టించుకోకుండా, తమపై లాఠీఛార్జి చేయడం అన్యాయమని ఆరోపించారు. పోలీసుల తీరును నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఘటన స్థలంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే నాయిని

- రూ. 1.59 కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 11: హనుమకొండ, కాజీపేట మండలాల లబ్ధిదారులకు చేయూత. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా కొండంత అండగా నిలుస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు. హనుమకొండ గోకుల్ నగర్ లోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం హనుమకొండ మరియు కాజీపేట మండలాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గారు మొత్తం 159 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 1,59,18,444 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాల కోసం తల్లిదండ్రులు అప్పుల పాలు కాకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. గతంలో పెళ్లిళ్లు చేయాలంటే పేదలు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, మండల స్థాయి అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెదురుముదురు ఘటనల మధ్య ముగిసిన పోలింగ్

- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్
- జిల్లాలో మొత్తం 729 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు
- 19 వ డివిజన్లో కాంగ్రెస్ బీజేపీ మధ్య స్వల్ప ఘర్షణ
- 11వ డివిజన్లో కాంగ్రెస్ ఎంఐఎంల మధ్య ఘర్షణ కాంగ్రెస్ అభ్యర్థి కి గాయాలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 11: నిజామాబాద్ జిల్లాలో చెదురు ముదురు ఘటన మధ్య మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగింది. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో అన్ని చోట్ల పోలింగ్ మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు చేరుకోవడం ప్రారంభించారు. ఉదయం 9గంటల సమయానికి సగటున 8.25 శాతం పోలింగ్ నమోదయ్యింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 6.49 శాతం, ఆర్మూర్ లో 11.05 శాతం, బోధన్ లో 14.24 శాతం, భీంగల్ లో 9.38 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఉదయం 11 గంటల సమయానికి సగటు పోలింగ్ 22.54 శాతం జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18.94 శాతం, ఆర్మూర్ లో 29.60 శాతం, బోధన్ లో 32.35 శాతం, భీంగల్ లో 31.09 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఓటింగ్ అనూహ్యంగా పుంజుకుంది. సగటున 39.68 శాతం ఓటింగ్ జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 35.49 శాతం, ఆర్మూర్ లో 47.93 శాతం, బోధన్ లో 50.69 శాతం, భీంగల్ లో 51.53 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి సగటున 48.55 శాతం ఓటింగ్ జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 43.18 శాతం, ఆర్మూర్ లో 60.07 శాతం, బోధన్ లో 61.77 శాతం, భీంగల్ లో 63.65 శాతం పోలింగ్ నమోదయ్యింది. జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి నిజామాబాద్ నగరంలోని ఎస్.ఎఫ్.ఎస్ స్కూల్, అర్సపల్లి పాఠశాల, మాలపల్లిలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, ఆర్మూర్ మున్సిపల్ పట్టణంలోని రాం మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, పెర్కిట్ లోని జిల్లా పరిషత్ బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 13న ఉదయం 8 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత చర్యలు చేపట్టామన్నారు.

అక్కడక్కడ ఘటనలు ...

జిల్లా కేంద్రంలోని రెండవ టౌన్ ప్రాంతంలో దొంగ ఓటు వేసేందుకు వచ్చిన యువతిని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే బోధన్ రాకసిపేట గోశాలలో దొంగ ఓటు వేసేందుకు ఇద్దరు యత్నంచగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఇక నగరంలోని 20 ,21 డివిజన్లో కాంగ్రెస్ టీఆర్ఎస్ కార్యకర్తల పై లాఠీ చార్జ్ జరిగింది. 19వ డివిజన్లో ఓట్లను ఇబ్బంది పెడుతున్నా రంటూ కాంగ్రెస్ బీజేపీ లు పోటాపోటీగా ప్రచారాలకు దిగటంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి రెండు వర్గాలను చెదరగొట్టారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి ల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. జిల్లా కేంద్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి అనుకున్న తరుణంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వర్గాల మధ్య ఘర్షణ ఉద్రిక్తత కు దారితీసింది. బాబన్ సహేబ్ పహాడ్ ప్రాంతంలో అభ్యర్థులు వారి అనుచరులు బాహాబహీ కి దిగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. డివిజన్లో ఒక పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి కరీం అనుచరులు బోగస్ ఓట్లు వేయిస్తున్నారని ఎంఐఎం అభ్యర్థి జక్కి యుద్దీన్ వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయం పై ఎంఐఎం నేతలు ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో రాళ్లు కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో అక్కడ రణరంగంగా మారింది. ఈ ఘటనలో కాంగ్రెస్ అభ్యర్థి కరీం తలకు తీవ్ర గాయాలై తలలో నుంచి రక్తం రావడంతో సహచరులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తమ అభ్యర్థిపై కావాలని ఎంఐఎం శ్రేణులు దాడికి పాల్పడ్డారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళన చెదరగొట్టారు ప్రస్తుతం అక్కడ భారీగా పోలీసులను మోహరించారు.

క్యూలైన్‌లో నిలబడి ఓటు వేసిన షబ్బీర్ అలీ

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి11: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో కామారెడ్డి పట్టణం రాజకీయ కోలాహలంతో నిండిపోయింది. బుధవారం జరిగిన ఈ పోలింగ్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తన ఓటు హక్కును వినియోగించుకొని పౌర బాధ్యతను చాటుకున్నారు. ఉదయాన్నే పట్టణంలోని వార్డు నెంబర్ 49, పోలింగ్ స్టేషన్ నెంబర్ 151 (గంజ్ స్కూల్) కు చేరుకున్న షబ్బీర్, ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా ఒక సాధారణ పౌరునిలా క్యూలైన్‌లో నిలబడ్డారు. తన వంతు వచ్చే వరకు వేచి చూసి ఓటు వేయడం ద్వారా అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఓటు వేసిన అనంతరం షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. పట్టణ ప్రగతిని కాంక్షించే వారు ప్రతి ఒక్కరూ తమ ఓటును బాధ్యతగా వేయాలి.కామారెడ్డి పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓటర్లు తమ తీర్పును ఇవ్వాలని, స్థానిక పరిపాలనలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. చైతన్యవంతమైన పౌరులు సెలవు దినంగా భావించకుండా, ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు శాతం పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 11: కామారెడ్డి మున్సిపాలిటీ లోని వార్డు నెంబర్ 18 లిమ్రా గార్డెన్ సమీపంలో గల ప్రైమరీ స్కూల్, , పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం పోలింగ్ కేంద్రములో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా ఓటు వేయాలని స్థానిక సుపరిపాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని పోలీస్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంప్స్ నిర్మించడమే కాక వీల్ చైర్స్ ను అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 17 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

త్వరలో జరిగే తమిళనాడు ఎన్నికల్లో మేం సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. 2021 కంటే ఎక్కువ స్థానాలను దక్కించుకుంటాం. కాంగ్రెస్‌తో పొత్తుతో పోటీ చేస్తాం. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీతో తనకు సోదర బంధం ఉంది. అధికారాన్ని పంచుకోవడమనే ప్రశ్న ఇప్పుడు ముఖ్యం కాదు.
- డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్

యువతకు, మహిళలకు 'జాగృతి' పెద్దపీట

- తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 11: "సంకల్పం, సేవాభావం కలిగిన యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది" అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాగృతి నాయకులు కుమ్మరి శివశంకర్, ఉండెల బాబురావు తో కలసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయన స్పందిస్తూ, యువతరం ముందుకు రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఒకప్పుడు విలువలతో కూడిన రాజకీయాలు ఉండేవని, నేటి కాలంలో అవి కరువవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తరం మారుతున్న కొద్దీ కొత్త ఆలోచనలు, కొత్త ఆకాంక్షలు కలిగిన యువత రాజకీయాల్లోకి రావడం చారిత్రక అవసరమని తెలిపారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పనిచేసే యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం ద్వారానే భవిష్యత్ తెలంగాణకు బలమైన పునాదులు వేయగలమని, రేపటి తరానికి ఆదర్శంగా నిలవగలమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పార్లమెంటరీ విధానం ద్వారానే సామాజిక విప్లవం సాధ్యమని నమ్మి, కల్వకుంట్ల కవితమ్మ గారు 'జాగృతి'ని రాజకీయ వేదికగా తీర్చిదిద్దుతున్నారని వెల్లడించారు. ఈ నూతన ప్రస్థానంలో యువతకు పెద్దపీట వేస్తూ, మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ, ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక నూతన ఒరవడిని సృష్టించి, చరిత్రలో నిలిచిపోయేలా పనిచేయాలన్న కృత నిశ్చయంతో ఉన్నామని, ఈ సామాజిక, రాజకీయ యజ్ఞంలో యువత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పాండురంగారెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- జిల్లాలో 82.03 శాతం పోలింగ్ నమోదు
- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి11: సిద్దిపేట జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హేమావతి తెలిపారు. జిల్లాలోని హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలలో బుధవారం ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు జరిగిన 4 మున్సిపాలిటీలలో మొత్తం 1 లక్ష 1 వేయి 85 మంది ఓటర్లు ఉండగా వారిలో 82.03 % తో 82921 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. వీరిలో పురుషులు 40380, స్త్రీలు 42536, ఇతరులు 05 కలరని తెలిపారు. మున్సిపాలిటీ వారీగా హుస్నాబాద్ 84.21 % దుబ్బాకలో 85.05 % చేర్యాలలో 83.41% మరియు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 79.35 % ఓటింగ్ నమోదయిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను విజయవంతం చేసిన ఎన్నికల సిబ్బందిని, ఎలాంటి అంచనీయ సంఘటన జరగకుండా కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధనా రష్మీ పెరుమాళ్ నేతృత్వంలో గట్టి బందోబస్తు బందోబస్తు నిర్వహించిన పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.అలాగే ఈనెల 13వ తేదీన శుక్రవారం నాడు ఉదయం 8:00 గంటల నుండి ఆయా మున్సిపాలిటీలలో ఏర్పాటుచేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని అందుకు పూర్తి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

దుబ్బాక : దుబ్బాక మున్సిపాలిటీలోనీ టిటిడి కళ్యాణ మండపం దగ్గర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల , జూనియర్ కళాశాలలోనీ పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటింగ్ సరళి ముగిసిన తర్వాత స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ప్రతిదీ చెక్ చేసుకుని బ్యాలెట్ బాక్స్ లాక్ వేసి సీల్ వేసి ఏ ఒక్క మెటీరియల్ కూడా మర్చిపోకూడదు సూచించారు. జోనల్ రూట్ ఆఫీసర్ ద్వారా మీకు కేటాయించిన వాహనం పోలీస్ ఎస్కార్ట్ ద్వారానే రిసెప్షన్ సెంటర్ కి వెళ్ళాలని తెలిపారు.రిసెప్షన్ సెంటర్ లో అన్ని అరేంజ్మెంట్ లు చూసుకుని బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది అందరికీ రాత్రి భోజన సదుపాయాల్లో ఎలాంటి లోటు రాకుండ చూసుకోవాలని అలాగే వారు వారి స్వగృహాలకు వెళ్లడానికి ఆయా రూట్ ల వారిగా బస్సు సౌకర్యం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఏడుపాయల వన దుర్గ భవాని మాతను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బుధవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో నియోజకవర్గ ప్రజలు చల్లగుండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు రోహిత్ రావు తెలిపారు.

- ప్రతిపక్షం, మెదక్

మంచిర్యాలలో ఓటు వేసిన మంత్రి వివేక్

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 11: మంచిర్యాల జిల్లాలోని హైటెక్ సిటీ 227 పోలింగ్ కేంద్రం వద్ద బుధవారం మైనింగ్ మరియు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను చేస్తున్న ప్రభుత్వ పథకాలు అభివృద్ధి పనులు చూసి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటును వినియోగించుకుంటున్నారని తెలిపారు. సుమారు పోలింగ్ 85 శాతం జరిగే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు.

ఓటు హక్కును వినియోగించుకున్న పీఎస్ ఆర్

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 11: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ లో గల పోలింగ్ కేంద్రంలో బుధవారం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగరం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని తెలిపారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు.

ఉద్యమకారుల ఆత్మగౌరవ సభకు తరలిరావాలి

- జాగృతి జిల్లా నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ పిలుపు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 11: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఈ నెల 12 న హైదరాబాదులోని బాగ్ లింగంపల్లి ఆర్టీసీ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని జాగృతి జిల్లా నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సభ గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నుండి పెద్ద ఎత్తున ఉద్యమకారులు, జాగృతి కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా ఈ సభ కీలకమైందని పేర్కొంటూ, జిల్లా నాయకులు, కార్యకర్తలు సమయానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భారీ స్థాయిలో జనసమ్మేళనం ఉండేలా జిల్లా నాయకత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిర్చి కాంపౌండ్ లోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులు ఓటు వేశారు.

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్

ఓటు వేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 9: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ లో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ గాంధీనగర్ వార్డ్ నెంబర్ 18 పోలింగ్ స్టేషన్ నెంబర్ 35 వద్ద కలెక్టర్ దంపతులు సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ లో భాగంగా ఆదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ వార్డ్ నెంబర్ 05 పోలింగ్ స్టేషన్ నెంబర్ 09 వద్ద అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

- సాధారణ పరిశీలకులు రవి కిరణ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి11: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతున్నట్లు సాధారణ పరిశీలకులు రవి కిరణ్ స్పష్టం చేశారు. బుధవారం మెదక్ మున్సిపల్ పరిధిలో ఉన్న పలు వార్డులలో,పోలింగ్ కేంద్రలలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. పోలింగ్ సిబ్బందిని, పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లను ఓటింగ్ ఏర్పాట్లు ఎలా ఉన్నాయంటూ తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు రవి కిరణ్ మాట్లాడుతూ.. మెదక్ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. మెదక్ జిల్లా మున్సిపల్ ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్ లో పాల్గొని మెదక్ మున్సిపాలిటీలో 100 శాతం ఓటింగ్ జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి,డిఎస్ పి ప్రసన్న కుమార్, మెదక్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు ,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యజుర్వేద స్వహాకార సప్తాహం

- పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి11: సిద్దిపేట క్రిష్ణసాగర్‌లోని శ్రీ శంకర మఠం శారదా దేవి దేవాలయంలో నిర్వహించిన శ్రీకృష్ణ యజుర్వేద స్వహాకార సప్తాహ మహోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేద పండితుల వేదఘోషల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. హరీష్ రావు యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన దేవాలయ ఆవరణలో భక్తులను, నిర్వాహకులను కలుసుకుని ఆశీస్సులు పొందారు. వేద సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు సమాజానికి మార్గదర్శకాలు అని హరీష్ రావు తెలిపారు. ఇలాంటి వేద కార్యక్రమాలు సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు, మఠ నిర్వాహకులు, భక్తులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్కడ చదువుకున్నారో అక్కడే ఉద్యోగం

- సిద్దిపేట ఐటి టవర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 11: స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వ కాలంలో సిద్దిపేటలో ఐటి టవర్ ఏర్పాటు చేశామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. బుధవారం ఆయన సిద్దిపేట ఐటి టవర్‌ను సందర్శించి అక్కడ పని చేస్తున్న యువతతో ముచ్చటించారు. ఐటి టవర్‌లో ఉన్న సౌకర్యాలు, పని పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు యువత తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై వెంటనే స్పందించిన హరీష్ రావు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. "ఎక్కడ చదువుకున్నారో అక్కడే ఉద్యోగం సాధించాలనే యువత ఆకాంక్షను నెరవేర్చేందుకే సిద్దిపేటలో ఐటి టవర్‌ను ఏర్పాటు చేశాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఐటి టవర్‌లో 17 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, సుమారు 350 మంది యువత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. స్థానిక యువత నైపుణ్యాభివృద్ధి కోసం సిద్దిపేటలో టాస్క్ (TASK) ట్రైనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టాస్క్ సెంటర్‌లో నిరంతరం శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటి టవర్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, ఇతర కార్మికులకు జీతాలు ఆలస్యమవుతున్నాయని తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు జీతాలు చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన ఐటి టవర్‌లోని నాలుగు అంతస్తులను పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు.

మల్లన్న సాగర్ నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయాలి

- రంగనాయక సాగర్ ఇరిగేషన్ కార్యాలయంలో నీటి విడుదలపై హరీష్ రావు సమీక్ష

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 11: మల్లన్న సాగర్ నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయాలనీ అధికారులను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ ఆదేశించారు.సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ఇరిగేషన్ కార్యాలయంలో మల్లన్న సాగర్ నుంచి నీటి విడుదలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు,దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇటీవల రైతులు నీటి విడుదల చేయాలని హరీష్ రావు, ప్రభాకర్ రెడ్డిని కలిసి కోరిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్న హరీష్ రావు, వెంటనే మల్లన్న సాగర్ నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు నీటి విడుదల ప్రారంభించారు. రంగనాయక సాగర్ కుడి కాలువలో పెరిగిపోయిన తుంగ, గడ్డిని వెంటనే తొలగించాలని ఆయన సూచించారు. ఈ నెల 13న రంగనాయక సాగర్ కుడి కాలువకు నీటి విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు నెలల్లో చందలాపూర్ లిఫ్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభించాలన్నారు. ఇర్కోడ్ లిఫ్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గోపులాపూర్, కస్తూరిపల్లి గ్రామాల వద్ద చెక్ డ్యామ్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అల్లీపూర్ గ్రామంలో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అల్లీపూర్ గ్రామంలోని కర్ణాల కుంటకు అటవీ శాఖ అనుమతుల సమస్యల వల్ల ఐదేళ్లుగా నీరు రాలేదని రైతులు వివరించారు. దీనిపై స్పందించిన హరీష్ రావు, అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి కర్ణాల కుంటకు నీరు చేరేలా లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హరీష్ రావు స్పష్టం చేశారు.

కేసీఆర్‌కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము సీఎం రేవంత్‌కు ఉందా.? ఆయనకు చేతకాదని చెబితే ఆ సంగతి కేంద్రం చూసుకుంటుంది. రేవంత్ సీఎం కాకముందు తన ఫోన్ ట్యాప్ అయిందని చెప్పారు. నిన్న వాళ్ల మంత్రి ఇప్పటికీ తన ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందన్నారు. మరి ట్యాపింగ్ ఎవరు చేస్తున్నట్లు? సీఎం చేస్తున్నారా? బీఆర్ఎస్ వాళ్లు చేస్తున్నారా?

- కేంద్ర మంత్రి బండి సంజయ్

విశ్వ వీక్షణం

భారత ప్రభుత్వం అమెరికాకు తలొగ్గింది

- పార్లమెంట్ లో రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: అమెరికా సర్కారుకు భారత ప్రభుత్వం తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు చేసేలా ఉందని, దానివల్ల భారత్‌కు ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. కేంద్రబడ్జెట్ పై చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతోపాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారని చెప్పారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలను బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదని అన్నారు. రాహుల్‌గాంధీ ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'ప్రపంచం మొత్తం ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారత ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. మన డేటాను కాపాడుకునేందుకు భారత్ చర్యలు తీసుకోవడం లేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించింది' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. 'భారత్ ఏయే దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తోంది. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోంది' అని వ్యాఖ్యానించారు.

భారత్ - పాకిస్తాన్ యుద్ధం నేనే ఆపా!

- లేకుంటే అణు యుద్ధమే జరిగేది
- మళ్లీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: గతేడాది జరిగిన భారత్, పాక్ సైనిక ఘర్షణ అణు యుద్ధంగా మారి ఉండేదని, దాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. నిజంగానే భారత్, పాక్ సైనిక ఘర్షణ న్యూక్లియర్ వార్‌కు దారితీసేదని, వాళ్లు 10 యుద్ధ విమానాలనూ కూల్చుకున్నారని ఆయన తెలిపారు. సుంకాల హెచ్చరిక ద్వారా ఆ సైనిక ఘర్షణను ఆపానని ట్రంప్ వెల్లడించారు. తాను ఇప్పటిదాకా 8 యుద్ధాలను ఆపానని, వాటిలో 6 యుద్ధాలను సుంకాలతోనే ఆపానన్నారు. ఒకవేళ యుద్ధాన్ని ఆపకుంటే, సుంకాలను విధిస్తాను అని ఆయా దేశాలను హెచ్చరించినట్లు అమెరికా అధ్యక్షుడు తెలిపారు. సైనిక ఘర్షణతో ప్రజలు చనిపోవడాన్ని చూడాలని తాను భావించడం లేదని స్పష్టం చేశానన్నారు. తాజాగా అమెరికాకు చెందిన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. భారత్, పాక్ సైనిక ఘర్షణను తానే ఆపానని 2025 సంవత్సరం మే 10 నుంచి ఇప్పటివరకు 80కిపైగా సార్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకున్నారు. ఆ క్రెడిట్ తనకే దక్కుతుందని ఆయన ప్రకటించుకున్నారు. 2025 మే 10న సోషల్ మీడియా వేదికగానూ దీనిపై ట్రంప్ ప్రకటన చేశారు. తన జోక్యం వల్ల భారత్, పాక్‌లు పూర్తి స్థాయిలో తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని వెల్లడించారు. అయితే ట్రంప్ ప్రకటనను భారత్ పదేపదే ఖండిస్తూ వచ్చింది. భారత్, పాక్ సైనిక ఘర్షణ వ్యవహారంలో మూడో పక్షం జోక్యం అనేదే లేదని తేల్చి చెప్పింది. పాక్ సైనిక ఉన్నతాధికారుల విన్నపం మేరకు కాల్పుల విరమణకు తాము అంగీకారం తెలిపామని భారత్ ప్రకటించింది.

ఎప్‌స్టీన్‌ను కలిసింది నిజమే!

- అతని నేరాలతో సంబంధం లేదు
- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఎప్‌స్టీన్ ఫైల్స్ అంశంలో తన పేరు రావడం, వాటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. రాహుల్ గాంధీవి నిరాధారమైన ఆరోపణలు అని తోసిపుచ్చారు. బడ్జెట్ పై ప్రసంగం సందర్భంగా రాహుల్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేరు ఉందని ప్రస్తావించారు. హర్దీప్‌తోపాటు అదానీ, అనిల్ అంబానీ పేర్లు ఉన్న విషయాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. ఈ అంశంపై హర్దీప్ సింగ్ పూరి మీడియాతో మాట్లాడారు. తన వివరణ ఇచ్చారు. తాను ఎప్‌స్టీన్‌ను కలిసిన మాట వాస్తవమే అని, అయితే, ఆయన చేసిన నేరాలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

"ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ)లో పని చేసినప్పుడు ఎప్‌స్టీన్‌ను కలిశాను. ఐపీఐలో మా బాస్ తెర్జె రాడ్ లార్సెన్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. ఆయన ద్వారా మా సంస్థ చర్చల సందర్భంగా ఎప్‌స్టీన్‌ను మూడు, నాలుగు సార్లు కలిశాను. మా మధ్య జరిగిన సంభాషణకు, ఆయన చేసిన నేరాలకు సంబంధం లేదు. 2009 నుంచి జరిగిన అంశాలపై ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజయ్యాయి. 2017లో నేను కేంద్ర మంత్రిగా చేరేంతవరకు న్యూయార్క్‌లో ఇండియాకు ప్రతినిధిగా పని చేశాను. ఇన్నేళ్లకాలంలో ఎప్‌స్టీన్‌ను కలిసింది మూడు నాలుగుసార్లు మాత్రమే. పూర్తి వృత్తిపరమైన అంశాల్లోనే ఆయనను కలిశాను. ఎనిమిదేళ్ల కాలంలో రెండే మెయిల్స్ చేసుకున్నాం. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి నిరాధారమైన ఆరోపణలు చేయడం అలవాటు. ఎప్‌స్టీన్ చేసిన నేరాలకు నాకు సంబంధం లేదు. అలాంటివాటికి నేను తగినవాడిని కాదు'' అంటూ హర్దీప్ సింగ్ పూరి వివరణ ఇచ్చారు.

రాహుల్‌కు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం

- దేశ అభివృద్ధిని కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నది
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారతదేశ అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతున్నదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని చూసి కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని, అందుకే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. భారత్‌అమెరికా దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మాత్రమే మేలు చేసేలా ఉందనేందుకు ఆధారాలు చూపాలని రాహుల్‌గాంధీకి రిజిజు సవాల్ విసిరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్ పార్టీలో లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

రాహుల్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీపై లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ హక్కులను ఉల్లంఘిస్తూ.. కేంద్రమంత్రిపై చేసిన ఆరోపణలకుగానూ విపక్ష నేతపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ చేస్తామని రిజిజు హెచ్చరించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నప్పటికీ రాహుల్‌గాంధీ.. తన ప్రశ్నలకు ఇతరులు చెప్పే సమాధానాలు వినకుండానే సభ నుంచి వెళ్లిపోతారని మండిపడ్డారు. ఒక సభ్యుడు ప్రసంగం చేసిన వెంటనే సభ నుంచి బయటకు వెళ్లకూడదనే నియమం ఉందని, ఈ విషయం ఆయనకు తెలియదా..? అని రిజిజు ప్రశ్నించారు.

అధికారంలో కాంగ్రెస్‌కు చోటివ్వం

- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, ఫిబ్రవరి 11: అధికారంలో వాటా కావాలంటూ కాంగ్రెస్ చేస్తున్న డిమాండును తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ తోసిపుచ్చారు. తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం పనిచేయదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య పొత్తు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. సంకీర్ణ ప్రభుత్వం తమిళనాడులో పనిచేయదని మాకూ తెలుసు, వారికీ (కాంగ్రెస్) తెలుసు అని ఇండియా టుడే కాంక్లేవ్‌లో మాట్లాడుతూ స్టాలిన్ వ్యాఖ్యానించారు. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 234 స్థానాల్లో 133 సీట్లను డీఎంకే గెలుచుకోగా సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. మిత్రపక్షంగా పోటీ చేసిన కాంగ్రెస్ పోటీ చేసిన 25 సీట్లలో 18 స్థానాలను గెలుచుకుంది. అయితే కాంగ్రెస్‌కు డీఎంకే ప్రభుత్వంలో చోటు దక్కలేదు. ఈసారి మాత్రం కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను డిమాండు చేస్తుండడంతో మిత్రుల మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తున్నది.



నిలబడ్డవాళ్లు సడెన్‌గా కుప్పకూలిపోతున్నారు. ఏమైందో ఆరాతీసే లోపే తుదిశ్వాస విడుస్తున్నారు. 'రాత్రంతా నాతోనే ఉన్నాడే, అంతలోనే ఇలా ఎలా?' హఠాత్తుగా ఎవరైనా గుండెపోటుతో చనిపోతే ఇలాగే విస్తుపోతుంటాం. అప్పటివరకూ ఆడుతూ, పాడుతూ తిరిగిన మనిషి ఉన్నట్టుండి మరణిస్తే ఎవరికీ నమ్మబుద్ధి కాదు. కానీ గుండెపోటు తీరే వేరు. చెట్టంత మనిషిని ఉన్నట్టుండి కుప్ప కూలుస్తుంది. అయితే ఇది హఠాత్ పరిణామం కాదా?

యుక్త వయసులో గుండెనొప్పి



డా. కౌశల్ గోవర్ధన
ఎం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
7702417779
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా.ధనుంజయ హాస్పిటల్, హైదరాబాద్

శరీరంలో అత్యంత కీలకమైన అవయవం గుండె అని అందరికీ తెలిసిందే...ఆ గుండె సంరక్షణ విషయంలో పలు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, వాటిని కొందరు పట్టించుకోని కారణంగా హృద్రోగ మరణాలు సంభవిస్తున్నాయి. ఇండియన్ హార్ట్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం ఒక్క 2020లోనే 30 నుండి 60 ఏళ్ల వయస్సు గల 19,238 మంది గుండెపోటుతో మరణించారు. 2021లో 18 నుండి 30 ఏళ్ల యువతలో 2,541 మరణాలు నమోదయ్యాయి.సుఖవంతమైన జీవనం కోసం సమకూర్చుకుంటున్న సౌకర్యాలు,సాంకేతిక పరిజ్ఞానాలే మనిషి ఆయువును తగ్గించేస్తున్నాయి. ఓ వైపు టెక్నాలజీ పెరుగుతున్నది, వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. మరోవైపు.. మనిషి ఆరోగ్యం మాత్రం అపసవ్య దిశలో పరుగెడుతున్నది. ఒకప్పుడు 60 పైబడిన వారిలో మాత్రమే గుండె సమస్యలు కనిపించేవి.నేడు, 40 ఏండ్లలోపు వారినీ హృద్రోగం మింగేస్తున్నది. చిన్నవయసులో గుండె సమస్యలకు అనేక కారణాలు.

ఛాతిలో ఒత్తిడిగా..

గుండెపోటు వచ్చే ముందు కొందరిలో ఛాతిలో ఒత్తిడిగా ఉంటుంది. దీనిని ఆంజినా అని కూడా పిలుస్తారు. ఈ సమయంలో ఊపిరాడకుండా ఉండడంతో పాటు ఆందోళనగా ఉంటుంది. గుండెకు రక్తప్రసరణ, ఆక్సిజన్ సరఫరా సరిగ్గా జరగనప్పుడు ఇలా జరుగుతుంది. తరచూ ఛాతిలో నొప్పి రావడం, ఒత్తిడి ఇలాగే కొనసాగడం వల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఆకస్మాత్తుగా తలతిరగడం, చలి చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే మీ వ్యక్తిగత వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలాగే ఆహారం సరిగ్గా తీసుకున్నప్పటికీ నీరసంగా ఉంటుంది. ఇది కూడా గుండె సమస్యకు సంకేతం కావచ్చు. గుండెతో పాటు ఊపిరితిత్తులు కూడా రక్తప్రసరణ లోపం వల్ల ప్రభావితం అవుతాయి. రక్తప్రసరణ సాఫీగా సాగకపోవడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. శ్వాస సరిగ్గా తీసుకోలేకపోవడం కూడా గుండెపోటు వచ్చే ముందు కనిపించే లక్షణాల్లో ఒకటి.

గుండెకు శత్రువులు

రక్తపోటు, మధుమేహం. కానీ, ఇటీవలి కాలంలో ఈ రెండు సమస్యలూ లేకపోయినా గుండెపోటు బారిన పడుతున్నారు చాలామంది. దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, వ్యాయామం లేకపోవడం. కొన్నిసార్లు మితిమీరిన కసరత్తూ ఓ కారణం కావచ్చు. యువతరం గుండెచుట్టూ కాపుకాసిన ప్రధాన శత్రువులు వీరే ..

1)ధూమపానం

గుండెపోటుకు, హృదయ సంబంధ వ్యాధులకు ప్రధాన కారణం. పొగాకులోని నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్ రక్తనాళాలను దెబ్బతీసి, రక్తం గడ్డకట్టేలా చేసి, గుండెకు ఆక్సిజన్ సరఫరాను తగ్గిస్తాయి. గుండెపోటుకు గురవుతున్న ప్రతి ఐదుగురిలో ఒకరు ధూమపాన ప్రియులే. పొగవల్ల రక్తం చిక్కబడుతుంది. ఫలితంగా, గడ్డకట్టే తత్వం పెరిగిపోతుంది. మృదువుగా ఉండాల్సిన రక్తనాళాలు కఠినంగా మారుతాయి. ఫలితంగా రక్తపోటు అధికం అవుతుంది. మంచి కొలెస్ట్రాల్ తగ్గిపోయి, చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోతుంది. రోగి పీల్చిన పొగ నేరుగా రక్త నాళాలను దెబ్బతీయడం వల్ల తక్షణమే రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉంది. ధూమపానం చేసే వారికి గుండెపోటు వస్తే కనుక, మందులు కూడా సమర్థంగా పనిచేయవు. స్మోకింగ్ మానేసిన తరువాత అయినా, గుండెపోటు రిస్క్ తగ్గాలంటే.. కనీసం రెండేండ్లు పడుతుంది. అసలు ధూమపానం అంటే ఏమిటో తెలియనివారి స్థాయికి గుండె ఆరోగ్యం చేరాలంటే.. 10 నుంచి 15 ఏండ్ల సమయం పడుతుంది. అయితే ధూమపానం మానేస్తే గుండెపోటు ప్రమాదం సగానికి తగ్గుతుంది..

2) వంశ పారంపర్యం

వంశపారంపర్య గుండెనొప్పి (INHERITED HEART CONDITIONS) కుటుంబంలో ఎవరికైనా ఉంటే, తర్వాతి తరాలకు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇది జన్యుపరమైన లోపాల వల్ల గుండె కండరాలు, రక్తనాళాలు లేదా విద్యుత్ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఛాతీ నొప్పి, గుండె దడ, అలసట మరియు శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. గుండెపోటు వంశ పారంపర్యంగా వచ్చే ఆస్కారాలూ ఉన్నాయి కనుక. తండ్రికి 55 ఏండ్ల లోపే గుండెపోటు వచ్చినా.. తల్లికి 65 ఏండ్ల లోపు గుండెపోటు వచ్చినా.. వారి సంతానానికి చిన్న వయసు లోనే గుండెపోటు వచ్చే ఆస్కారం అధికం.

3) కొలెస్ట్రాల్‌తో సమస్యలు

అధిక కొలెస్ట్రాల్, ముఖ్యంగా LDL (చెడు) కొలెస్ట్రాల్, రక్తనాళాల గోడలపై పేరుకుపోయి (ప్లేక్), రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది, దీనివల్ల గుండెపోటు, స్ట్రోక్, మరియు అథెరోస్క్లెరోసిస్ వంటి తీవ్రమైన గుండె సమస్యలు వస్తాయి. ఇది రక్తపోటును పెంచి, ఛాతి నొప్పి (ఆంజినా) మరియు గుండె దడ వంటి లక్షణాలకు దారితీస్తుంది, ఇది చాలా కాలం పాటు నిశ్శబ్దంగా ఉంటూ గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది... నాణ్యత లేని ఆహారంతో శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోతుంది. వ్యాయామం లేకపోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఆ మేరకు చెడు కొలెస్ట్రాల్ అధికమైపోయి గుండెపై భారం పడుతుంది. రక్త పరీక్షల ద్వారా మాత్రమే కొలెస్ట్రాల్ స్థాయి నిర్ధారణ అవుతుంది. ఊబకాయుల్లోనే అధిక కొలెస్ట్రాల్ ఉంటుందనేది ఒక అపోహ మాత్రమే..

4) ఆహారపు అలవాట్లు

గుండె నొప్పి (హార్ట్ ఎటాక్) నివారణకు సమతుల్య ఆహారం, ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు మరియు ఒమేగా 3 చేపలు తీసుకోవడం అత్యంత ముఖ్యం. ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు మరియు సంతృప్త కొవ్వులను తగ్గించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. డీప్ ఫ్రై చేసిన పదార్థాలు, బేకరీ ఐటమ్స్, ప్రాసెస్డ్ ఫుడ్ ఆరగించడం ఫ్యాషన్‌గా మారింది. దీనివల్ల బరువు పెరుగుతున్నది. కొలెస్ట్రాల్, షుగర్ స్థాయిలూ హద్దుమీరుతున్నాయి...

5) అధిక బరువు, ఊబకాయం

గుండెపై ఒత్తిడి: ఎక్కువ బరువు ఉండటం వల్ల గుండె రక్తాన్ని పంప్ చేయడానికి కష్టపడాల్సి వస్తుంది, దీనివల్ల కండరాలు మందమై గుండెపోటు వచ్చే అవకాశం ఉంది BROWN UNIVERSITY HEALTH.

కొలెస్ట్రాల్ మరియు రక్తపోటు: ఊబకాయం వల్ల రక్తంలో అధిక కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ పెరుగుతాయి, ఇవి ధమనులను (ARTERIES) మూసివేసి గుండె జబ్బులకు దారితీస్తాయి

మధుమేహం: ఊబకాయం టైప్ 2 మధుమేహానికి కారణమవుతుంది, ఇది కూడా గుండె కణాలను దెబ్బతీస్తుంది

స్లీప్ అప్నియా: అధిక బరువు వల్ల నిద్రలో శ్వాస ఆగిపోవడం (SLEEP APNEA) జరుగుతుంది, ఇది గుండెపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది..

6) శారీరక శ్రమ లేకపోవడం

శారీరక శ్రమ లేకపోవడం (నిశ్చల జీవనశైలి) గుండె కండరాలను బలహీనపరిచి, ఊబకాయం, అధిక రక్తపోటు మరియు కొలెస్ట్రాల్‌కు దారితీసి, గుండెపోటు ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుంది. నిరంతరం కూర్చుని పని చేయడం వల్ల ఛాతీలో బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా గుండెపోటు వంటి తీవ్రమైన నొప్పి సంభవించవచ్చు, కావున క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం.

గుండెపోటు ప్రాథమిక లక్షణాలు

- కేంద్రంలో ఒత్తిడి, బిగుతు, నిండినట్లుగా లేదా నొప్పిగా అనిపించడం, ఇది కొన్ని నిమిషాలు ఉండిపోవచ్చు లేదా తగ్గి, తిరిగి రావచ్చు.
- శరీరంలోని ఇతర భాగాలలో నొప్పి: ఛాతీ నుండి చేతులు (ముఖ్యంగా ఎడమ), వీపు, మెడ, దవడ, లేదా కడుపులోకి నొప్పి వ్యాపించడం.
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది: ఛాతీ అసౌకర్యం లేదా ఊపిరి ఆడకపోవడం.
- చల్లటి చెమటలు: అకస్మాత్తుగా చల్లగా, జిగటగా చెమటలు పట్టడం.
- తల తిరగడం లేదా మూర్ఛపోతున్నట్లు అనిపించడం: తేలికగా అనిపించడం లేదా పడిపోతున్నట్లు అనిపించడం.
- వికారం లేదా వాంతులు: కడుపులో తిప్పినట్లు అనిపించడం లేదా వాంతులు అవడం.
- తీవ్రమైన ఆందోళన: భయంకరమైన ఆందోళన లేదా భయం కలగడం.
- గుండె దడ (PALPITATIONS): గుండె వేగంగా లేదా లయ బద్ధంగా కొట్టుకోవడం.

చాలా సందర్భాల్లో ఈ లక్షణాలను గ్యాస్ట్రిక్ లేదా కండరాల సమస్యగా పొరబడే అవకాశం ఉంది. తక్షణం ఆస్పత్రికి వెళ్లకపోతే గుండెకు రక్త సరఫరా తగ్గిపోయి ఆకస్మిక మరణం సంభవించవచ్చు.

- బాధితులను 3 నుంచి 4 గంటల్లో హాస్పిటల్‌కు తీసుకెళ్తే, కోలుకునే అవకాశాలు ఎక్కువ.
- తరచూ ఛాతీ నొప్పి వస్తే పరీక్షలు చేయించుకుని కారణాలను నిర్ధారించుకోవాలి. ధూమపాన ప్రియులు, ఊబకాయులు, వంశ పారంపర్య చరిత్ర ఉన్నవారి విషయంలో మరింత జాగ్రత్త అవసరం.

7) మితిమీరిన (అతిగా) వ్యాయామము చెయ్యడం

అంతులేని శారీరక శ్రమ, ఒత్తిడి వల్ల ప్రాణాంతకంగానూ పరిణమించవచ్చు. నిత్యం వ్యాయామం చేయకుండా, ఒకేసారి మితిమీరిన కసరత్తుకు సిద్ధపడితే గుండె మీద భారం పడుతుంది. అది గుండెపోటుకు దారితీసే ఆస్కారం ఉంది.. జిమ్ వర్కవుట్స్‌తో హృదయ స్పందన అకస్మాత్తుగా పెరిగిపోతుంది. ఫలితంగా రక్తనాళాలు నిమిషాల్లోనే 40 నుంచి 100 శాతం మేర బ్లాక్ అవుతాయి. దీంతో, గుండెపోటు వస్తుంది.

8) మానసిక ఒత్తిడి

గతంలో కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉండేది. కరోనా కాలం నుంచీ ప్రతి ఇల్లూ వర్క్ ఫ్రమ్ హోమ్‌తో బిజీబిజీగా కనిపిస్తున్నది. మినీ ఆఫీసుగా మారుతున్నది. ఇంట్లో నుంచే పనిచేస్తుండటంతో సేదతీరే అవకాశమూ లేకుండా పోయింది. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నది యువత. కుటుంబ, ఆర్థిక సమస్యలు, ఉద్యోగ అభద్రత, భార్య భర్తలు బంధాలకు బీటలు.. తదితర కారణాల వల్ల మానసిక రుగ్మతలు అధికం అవుతున్నాయి. ఈ 'సైకాలజికల్ స్ట్రెస్' కూడా గుండెపోటుకు ఓ కారణమే.

9) మాదక ద్రవ్యాల వినియోగం

ప్రమాదకర డ్రగ్స్: కొకైన్ మరియు మెథాంఫేటమిన్ (METH) గుండెకు అత్యంత ప్రమాదకరమైనవి, ఇవి గుండెపోటుకు దారితీస్తాయి.

గుండెపై ప్రభావం: ఇవి గుండె రక్త నాళాలను కుంచించుకుపోయేలా చేస్తాయి (VASOSPASMS), తద్వారా గుండెకు ఆక్సిజన్ అందక నొప్పి (ANGINA) కలుగుతుంది.

గుండె నొప్పి నిర్ధారణ పరీక్షలు

గుండె నొప్పి (హార్ట్ ఎటాక్)ను ప్రధానంగా ECG (ELECTROCARDIOGRAM), ట్రోపోనిన్ వంటి రక్త పరీక్షలు, ఎకోకార్డియోగ్రామ్ (ECHO), మరియు కరోనరీ ఆంజియోగ్రామ్ ద్వారా ఖచ్చితంగా నిర్ధారిస్తారు. ఈ పరీక్షలు గుండె కండరాల నష్టం, రక్తప్రవాహంలో అడ్డంకులు మరియు గుండె పనితీరును పరిశీలిస్తాయి. ఛాతీ నొప్పి, శ్వాస ఆడకపోవడం, వికారం వంటి లక్షణాలు..ఈసీజీ ద్వారా గుండె సమస్యను గుర్తించవచ్చు. కొంతమందికి మొదటిసారి చేసే ఈసీజీలో సమస్య బయటపడదు. ఈసీజీ సాధారణంగా ఉందంటే సమస్య లేదని కాదు అర్థం. రెండు మూడుసార్లు తీస్తే అందులో సమస్య బయటపడే ఆస్కారం ఉంటుంది.

గుండె నొప్పి చికిత్స

గుండె నొప్పి (CHEST PAIN) చికిత్స దాని కారణంపై ఆధారపడి ఉంటుంది. గుండె సంబంధిత నొప్పికి నైట్రోగ్లిజరిన్ (రక్తనాళాలను సడలించడానికి), ఆస్పిరిన్ (గడ్డకట్టడాన్ని నిరోధించడానికి), రక్తపోటు మందులు, మరియు క్లాట్‌బస్టింగ్ ఔషధాలను వాడతారు. తీవ్రమైన సందర్భాల్లో యాంజియోప్లాస్టీ, స్టెంటింగ్, లేదా బైపాస్ సర్జరీ అవసరం కావచ్చు. ..

- ముఖ్యంగా యువతలో సాధారణంగా ఒకే బ్లాక్ ఉంటుంది. అదే వయోధికులలో మల్టిపుల్ బ్లాక్స్ ఉంటాయి. వైద్య నిపుణులు రక్తనాళాల్లో ఏర్పడిన బ్లాక్ ఆధారంగా స్టెంట్ వేస్తారు.
- రక్తం పలుచబడే ఇంజక్షన్లతో కూడా చికిత్స ఇస్తారు. కానీ ఛాతీ నొప్పి వచ్చిన మూడు గంటల్లోపు ఇస్తేనే ఫలితం ఉంటుంది. 12 గంటలు గడిచాక ఈ చికిత్స సమర్థవంతంగా పనిచేయదు.
- బ్లడ్ థిన్నర్ ఇంజక్షన్ తీసుకున్న తరువాత రోగికి కచ్చితంగా ఆంజియోగ్రామ్ చేయించాలి. అవసరమైతే బైపాస్ సర్జరీ చేయాల్సి ఉంటుంది..



ఆస్పత్రిలో చేరిన అభిషేక్.. నమీబియాతో మ్యాచ్ డౌటే!

టీ20 ప్రపంచ కప్‌లో భారత జట్టుకు ఊహించని షాక్ తగిలింది. జట్టులో డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన దిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. గురువారం దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నమీబియాతో జరిగే కీలక మ్యాచ్‌కు అభిషేక్ దూరమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత రెండు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆయనకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారని వర్గాలు వెల్లడించాయి. ఈ రోజే డిశ్చార్జ్ అవుతారా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే నమీబియాతో మ్యాచ్‌లో ఆడటంపై సందిగ్ధత నెలకొంది. ఇటీవల ఫిబ్రవరి 7న యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో కూడా అభిషేక్ పూర్తిస్థాయిలో పాల్గొనలేదు. రెండో ఇన్నింగ్స్‌లో మైదానంలోకి దిగకపోవడం గమనార్హం. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ మాట్లాడుతూ జట్టుపై తుది నిర్ణయం మ్యాచ్‌కు ముందు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, ఫిబ్రవరి 15న కొలంబోలో పాకిస్థాన్‌తో జరిగే అత్యంత కీలక మ్యాచ్‌కు అభిషేక్ తిరిగి అందుబాటులోకి వస్తారని జట్టు యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

చెలరేగిన రూథర్ ఫర్డ్

- ఇంగ్లండ్ పై వెస్టిండీస్ విజయం

టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై వెస్టిండీస్ విజయపరంపర కొనసాగుతున్నది. గ్రూపుసీ పోరులో భాగంగా ఇంగ్లండ్‌తో బుధవారం జరిగిన కీలక పోరులో విండీస్ 30పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. తొలుత షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్(42 బంతుల్లో 76 నాటౌట్, 2ఫోర్లు, 7సిక్సులు) అజేయ అర్ధసెంచరీతో విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 196/6 స్కోరు చేసింది. ఓపెనర్లు బ్రెండన్ కింగ్(1), షాయ్ హోప్(0) ఘోరంగా విఫలం కాగా, మిడిలార్డర్‌లో రూథర్‌ఫర్డ్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టు పోరాడే స్కోరు అందుకుంది. ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ రూథర్‌ఫర్డ్ తన ఇన్నింగ్స్‌లో ఏడు భారీ సిక్సులు బాదాడు. ఒవర్టన్(2/33), రషీద్(2/16) రెండేసి వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 19 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. సామ్ కరన్(43 నాటౌట్) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. గుడకేశ్ మోతీ(3/33), రోస్టన్ చేస్(2/29) ఇంగ్లండ్ పతనంలో కీలకమయ్యారు. జట్టుకు భారీ స్కోరు అందించిన రూథర్‌ఫర్డ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పెళ్లి ఉదయ్‌పూర్‌లో.. రిసెప్షన్ హైదరాబాద్‌లో!!

విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న పెళ్లి వార్త మరోసారి సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. గత కొన్నేళ్లుగా ఈ ఇద్దరూ ప్రేమలో ఉన్నారనే వార్తలు సోషల్ మీడియాలో తరచూ వినిపిస్తున్నాయి. కలిసి పలు సినిమాల్లో నటించిన తర్వాత వీరి మధ్య సన్నిహిత్యం పెరిగిందని, ఆ పరిచయం ప్రేమగా మారిందని ఫ్యాన్స్ నమ్మకం. ఇటీవల వీరిద్దరూ సైలెంట్‌గా ఎంగేజ్మెంట్ కూడా చేసుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో ఈ జంట పెళ్లి ఎప్పుడు జరుగుతుందా అని అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విజయ్ – రష్మిక వివాహం ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఒక ప్రైవేట్ ప్యాలెస్‌లో జరగనుందని తెలుస్తోంది. ఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరవుతారని తెలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ సినిమా షూటింగ్స్‌తో బిజీగా ఉన్నప్పటికీ, పెళ్లి కోసం ప్రత్యేకంగా గ్యాప్ తీసుకుని ఈ కార్యక్రమాన్ని సింపుల్‌గా కానీ గ్రాండ్‌గా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. పెళ్లి ఫోటోలు ఎప్పుడొస్తాయా అంటూ ఫ్యాన్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక వివాహం అనంతరం మార్చ్ 4న హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ రిసెప్షన్‌కు టాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ హీరోలు, దర్శకులు, నిర్మాతలు హాజరయ్యే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అభిమానులు కూడా ఈ ఈవెంట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఐర్లండ్ ను చిత్తు చేసిన ఆస్ట్రేలియా

టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ వేటను ఆస్ట్రేలియా ఘన విజయంతో ఆరంభించింది. కొలంబో వేదికగా పూర్తి ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో కంగారూలు.. 67 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచేశారు. బ్యాటింగ్‌లో భారీ స్కోర్లేమీ నమోదుకాకపోయినా మార్కస్ స్టోయినిస్ (29 బంతుల్లో 45, 2 ఫోర్లు, 1 సిక్స్), జోష్ ఇంగ్లిస్ (17 బంతుల్లో 37, 6 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఛేదనలో ఐర్లాండ్.. ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లీస్ (4/12), ఆడమ్ జంపా (4/23) ధాటికి 16.5 ఓవర్లలో 115 రన్స్‌కే చేతులెత్తేసింది. ఆ జట్టులో డాక్‌రెల్ (29 బంతుల్లో 41, 3 ఫోర్లు, 2 సిక్సులు) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు. ఈ మ్యాచ్‌కు ముందు ఆసీస్ సారథి మిచెల్ మార్ష్ గాయంతో దూరమవడంతో ఈ మ్యాచ్‌కు ట్రావిస్ హెడ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

వివాదం ముగిసిందా?

రామ్‌చరణ్ నుంచి నాని వరకు పూజా హెగ్డే నుంచి అనుపమ పరమేశ్వరన్ వరకు ఇప్పటికే వివిధ బ్రాండ్‌లకు ప్రచార కర్తలుగా వ్యవహరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో కొంత మంది వివాదాలని ఎదుర్కొంటుంటే మరి కొంత మంది మాత్రం వివాదాలకు దూరంగా ఉంటూ తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇదిలా ఉంటే మిల్క్ బ్యూటీ తమన్నా కూడా ఈ జాబితాలో చేరింది. జపనీస్ కాస్మెటిక్స్ నుంచి ఫాంటా వరకు పదికి పైనే ప్రముఖ బ్రాండ్‌లకు ప్రచార కర్తగా వ్యవహరిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ ఖాతాలోకి మరో ప్రతిష్టాత్మకమైన బ్రాండ్ వచ్చి చేరింది. అదే `మైసూర్ సాండల్ సోప్`. గత కొన్ని దశాబ్దాలుగా ప్రముఖ బ్రాండ్‌లలో ఒకటిగా పాపులారిటీని, ప్రజల నమ్మకాన్ని సొంతం చేసుకుని ఇప్పటికీ అదే క్రేజ్‌ని సొంతం చేసుకుని రికార్డు స్థాయిలో సేల్స్ జరుగుతున్న `మైసూర్ సాండల్ సోప్`కు మిల్క్ బ్యూటీ తమన్నా బ్రాండ్ అంబాసిడర్‌గా ఖరారైంది. కర్ణాటక ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే `మైసూర్ సాండల్ సోప్` ఉత్పత్తిని ప్రభుత్వమే కొన్ని దశాబ్దాలుగా చూసుకుంటోంది. అలాంటి ఈ ప్రోడక్ట్‌కు తమన్నా అయితే బాగుంటుందని కర్ణాటక ప్రభుత్వం తనని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. దీనిపై గత కొంత కాలంగా కర్ణాటకలో నిరసనలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ ప్రాంతానికి చెందని వ్యక్తిని ఎలా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తారని, ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పలువురు ప్రభుత్వానికి సూచించారు. అయినా సరే ప్రభుత్వం ఎనక్కి తగ్గలేదు. తమన్నానే బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ తాజాగా ఆమెతో కాంట్రాక్ట్‌ని కుదుర్చుకోవడం విశేషం.

ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో

భారత షూటర్ల హవా

ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. బుధవారం జరిగిన పురుషుల 25మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఫైనల్లో యువ షూటర్ అనీశ్ భన్వాల కాంస్య పతకంతో మెరిశాడు. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో అనీశ్ 23 పాయింట్లతో మూడో స్థానంలో నిలువగా, యోషియోకా దాయి(31, జపాన్), చిర్‌యుకిన్ నికిత(28, కజకిస్థాన్) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఇదే విభాగంలో ఆదర్శ్‌సింగ్(11) ఆరో స్థానంలో నిలిచి నిరాశపరిచాడు అనీశ్(574), ఆదర్శ్‌సింగ్(573) పాయింట్లతో ఫైనల్ పోరుకు అర్హత సాధించడగా, నాలుగో సిరీస్ తర్వాత ఆదర్శ్ ఎలిమినేట్ అయ్యాడు. మరోవైపు 50మీటర్ల జూనియర్ రైఫిల్ ఈవెంట్‌లో అద్రియాన్ కర్మాకర్, రోహిత్ కన్యాన్, హేమంత్ బర్మన్‌తో కూడిన త్రయం ఫైనల్లో నిలిచింది. పురుషుల జూనియర్ 25మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ కేటగిరీలో సూరజ్ శర్మ(23), ముకేశ్ నేలవల్లి(19) వరుసగా రజత, కాంస్య పతకాలు ఖాతాలో వేసుకున్నారు. ఓవరాల్‌గా భారత్ ప్రస్తుతం 41స్వర్ణాలు, 19 రజతాలు, 15 కాంస్య పతకాలతో కొనసాగుతున్నది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200